




కమర్షియల్ కాంప్లెక్స్‌లో అగ్నిప్రమాదం

- షార్ట్‌సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు
- షోరూమ్‌లోని కార్లకు నష్టం
- సెల్లార్‌లో కారు దగ్ధం
- రూ.50 లక్షల ఆస్తి నష్టం?

.8లో




# పొంచివున్న తుఫాన్ గండం

అన్నదాతలు తీవ్ర ఆందోళన

వరి పంట చేతికి వచ్చే సమయంలో మరోసారి ప్రకృతి విపత్తు

- ఇప్పటికే కోతలు మొదలుపెట్టిన రైతులు
- వారం, పది రోజుల్లో ముమ్మరం..
- ఇదే సమయంలో తుఫాన్ హెచ్చరికలతో దిక్కుతోచని స్థితి



చోడవరంలో గింజ కట్టే దశలో వున్న వరిపైరు

చోడవరం/ రావికమతం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):

**గత నెలలో సంభవించిన 'మొంథా' తుఫాన్ నష్టం నుంచి ఇప్పుడిప్పుడే బయటపడుతుండగా.. బంగాళాఖాతంలో మరో తుఫాన్ ఏర్పడుతుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా వరి రైతులు బెంబేలెత్తిపోతున్నారు. జిల్లాలో ప్రస్తుతం వరిపైరు గింజ పాలుపోసుకునే దశ నుంచి కోత దశ వరకు వుంది. ఇటువంటి తరుణంలో తుఫాన్ సంభవిస్తే తీవ్రంగా నష్టపోతామని రైతులు వాపోతున్నారు.**

**ముందస్తుగా వరినాట్లు వేసిన పొలాల్లో రెండు, మూడు రోజుల క్రితం కోతలు మొదలయ్యాయి. బోర్లు వున్నచోట కోతలు పూర్తిచేసి, కుప్పలు వేస్తున్నారు. కానీ సుమారు 90 శాతం విస్తీర్ణంలో పంట ఇంకా కోత దశకు చేరలేదు. తుఫాన్ వస్తుందన్న హెచ్చరికలతో కొంతమంది రైతులు గురువారం హడావిడిగా వరి కోతలు మొదలుపెట్టారు.**

కాగా గత నెలలో సంభవించిన మొంథా తుఫాన్ సమయంలో కురిసిన భారీ వర్షాలతో జిల్లాలో సుమారు మూడు వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్టు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. కానీ వాస్తవంగా ఐదారు వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు సమాచారం. ఇతరచోట్ల అంతగా నష్టం లేకపోవడం, వాతావరణం పొడిగా వుండడంతో పంట బాగా పండి, ధాన్యం దిగుబడి ఆశాజనకంగా వుంటుందని రైతులు భావిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల అంచనా ప్రకారం మరో రెండు, మూడు వారాల్లో జిల్లా అంతటా వరి కోతలు పూర్తవుతాయి. కానీ ఇప్పుడు తుఫాన్ రూపంలో ముప్పు పొంచివుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ శాఖ సమాచారం మేరకు 22వ తేదీన ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుంది. 24వ తేదీకల్లా వాయుగుండంగా మారుతుంది. తదుపరి 48 గంటల్లో తుఫాన్‌గా బలపడి ఆంధ్రప్రదేశ్ తీరంవైపుగా రానున్నది. దీని ప్రభావంతో 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు తొలుత రాయలసీమ, దక్షిణ కోస్తాలో, తరువాత ఉత్తరకోస్తాలో వర్షాలు కురుస్తాయని వాతావరణ ... మిగతా 8వ పేజీలో



రావికమతం మండలం మత్స్యపురంలో రెండు రోజుల క్రితం కోసిన వరి పంట

# పడకేసిన ఉపాధి పనులు

కన్వర్జెన్సీ పనులకు ఐదు నెలలుగా అందని బిల్లులు

- సీసీ, బీటీ రోడ్లకు రూ.70 కోట్ల బకాయిలు
- మిగిలిన పనులు చేయలేమంటూ చేతులెత్తేస్తున్న కాంట్రాక్టర్లు



రావికమతంలో ఉపాధి నిధులతో వేసిన సిమెంట్ రోడ్డు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

**మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కన్వర్జెన్సీ పనులు ముందుకు సాగడం లేదు. కాంట్రాక్టర్లు ఇప్పటికే పూర్తి చేసిన పనులకు సంబంధించి బిల్లులను అప్‌లోడ్ చేసి నెలలు గడుస్తున్నప్పటికీ నిధులు విడుదల కాలేదు. దీంతో కాంట్రాక్టర్లు మిగిలిన పనులు ఆపేశారు. పాత బిల్లులు అందేవరకు కొత్తగా పనులు చేపట్టేందుకు ఆసక్తి చూపడంలేదని తెలిసింది.**

జిల్లాలో 2025-26 సంవత్సరానికిగాను ఉపాధి హామీ కన్వర్జెన్సీ కింద పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా గ్రామాల్లో 1,296 పనులకు రూ.73.25 కోట్లు కేటాయించారు. కూటమి అధికారంలో వుండడంతో బిల్లులు త్వరగా మంజూరవుతాయన్న ఉద్దేశంతో కాంట్రాక్టర్లు ఉత్సాహంగా ముందుకొచ్చి పెద్దఎత్తున సీసీ, బీటీ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. ఈ ఏడాది జూన్‌నాటికి సుమారు రూ.65 కోట్ల విలువ చేసే రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేశారు. కొద్ది రోజులకే బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. సుమారు ఐదు నెలలు గడిచినప్పటికీ నిధులు విడుదల కాలేదు. పీఆర్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా చేపట్టిన సీసీ, బీటీ రోడ్లకు సంబంధించి పూర్తయిన పనులకు రూ.55 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు చెబుతున్నారు. నిధుల విడుదలపై అధికారులు నాలుగు నెలల నుంచి ఇదిగో.. అదిగో.. అంటున్నారే తప్ప కాంట్రాక్టర్ల ఖాతాల్లో డబ్బులు మాత్రం జమ కావడం లేదు. కొంతమంది కాంట్రాక్టర్లకు రూ.10 లక్షల నుంచి కోటి రూపాయలకుపైగా బిల్లులు పెండింగ్‌లో వున్నాయి. సీసీ, బీటీ రోడ్ల నిర్మాణ పనులకు అప్పులు తెచ్చిన కాంట్రాక్టర్లు.. వాటికి వడ్డీలు కట్టడానికి ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగమే కాకుండా సమగ్ర శిక్ష, అటవీ శాఖ, సెరీకల్చర్, పశుసంవర్థక శాఖల్లో ఉపాధి హామీ పథకం కన్వర్జెన్సీ కింద చేసిన పనులకు సైతం బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి. దీంతో ఆయా శాఖల్లో కొత్త పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకురాని పరిస్థితి నెలకొంది.



అనకాపల్లి మండలం బాటజంగాలపాలెంలో రైతు సేవా కేంద్రం వద్ద నిర్మించిన ఇంకుడు గుంత

**మారని తీరు..**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పనులకు సంబంధించి చెల్లింపులు సీఎఫ్ఎంఎస్ విధానంలో జరిగేవి. దీనివల్ల కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు అందకపోవడంతో పనులు చేసేందుకు ముందుకు వచ్చేవారు కారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పరిస్థితులను అధిగమించేందుకు కొత్త ఖాతాల ద్వారా నగదు చెల్లించాలని నిర్ణయించింది. అన్ని ప్రభుత్వ శాఖల బ్యాంకు ఖాతాలను ఒకే ఖాతా కిందకు తీసుకొచ్చింది. పోర్టల్‌లో నమోదు చేసి వరుస క్రమంలో బిల్లులు చెల్లించేందుకు చర్యలు చేపటింది. కానీ పరిస్థితుల్లో మార్పులు రాలేదు. తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తడం, కేంద్ర ప్రభుత్వం నుంచి నిధుల విడుదలలో జాప్యం వంటి కారణాలతో సకాలంలో బిల్లులు చెల్లించని పరిస్థితులు నెలకొన్నాయి. బిల్లుల పెండింగ్‌పై పీఆర్ ఈఈ ప్రసాద్‌ను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా.. పూర్తయిన పనులకు సంబంధించి బిల్లులు అప్‌లోడ్ చేశామని, మరో వారం రోజుల్లో నిధులు విడుదలయ్యే అవకాశం వుందన్నారు.

## ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయండి

- రైస్ మిల్లర్లు వెంటనే ఈ-బ్యాంకు గ్యారంటీని సమర్పించాలి
- జాయింట్ కలెక్టర్ జాహ్నవి ఆదేశం



మాట్లాడుతున్న జేసీ జాహ్నవి

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో వరి కోతలు ప్రారంభమైనందున ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం తన ఛాంబర్‌లో పౌర సరఫరాల సంస్థ అధికారులు, జిల్లాలోని రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైస్ మిల్లర్లు అందరూ వెంటనే ఈ-బ్యాంక్ గ్యారంటీలను పౌరసరఫరాలకు సమర్పించాలని చెప్పారు. ధాన్యం సేకరణకు అవసరమైన గోనె సంచులను ముందుగానే ఆయా కొనుగోలు కేంద్రాలకు పంపాలని స్పష్టం చేశారు. ధాన్యంలో తేమ శాతాన్ని, నాణ్యతను నిర్ధారించే క్రమంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని చెప్పారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మూర్తి, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ పి.జయంతి, తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష ఏపీసీగా ఉప్పాడ అరుణ

అనకాపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):

సమగ్ర శిక్ష జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ (ఏపీసీ)గా ఉప్పాడ అరుణ నియమితులయ్యారు. వాణిజ్య పన్నుల శాఖలో సీటీవోగా పనిచేస్తున్న ఆమెను డిప్యూటేషన్‌పై ఏపీసీగా నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఇదే పోస్టులో పనిచేసిన జయప్రకాశ్‌ను మాతృ సంస్థ (ప్రభుత్వ కళాశాల అధ్యాపకుడిగా)కు పంపింది.

# ఇంటర్ పరీక్షలకు సన్నాహాలు

పలు కేంద్రాలను తనిఖీ చేసిన డీఐఈవో

- మౌలిక సదుపాయాల పరిశీలన
- ఫస్టియర్ విదార్థులు 13,589 మంది, సెకండియర్ విద్యార్థులు 16,179 మంది
- డీఐఈవో వినోద్‌బాబు



పరవాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతి గదిని పరిశీలిస్తున్న డీఐఈవో వినోద్‌బాబు (ఫైల్ ఫొటో)

నర్సీపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):

**వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి అధికారులు ఇప్పటి నుంచే సన్నాహాలు చేస్తున్నారు. ప్రధానంగా పరీక్షా కేంద్రాలు, వాటిలో మౌలిక సదుపాయాలపై దృష్టి సారించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మద్దిలి వినోద్‌బాబు ఇటీవల జూనియర్ కళాశాలలను సందర్శించి వాటిల్లో గదుల్లో బెంచీలు, ఫ్యాన్లు, లైట్లు, మరుగుదొడ్లు, నీటి సదుపాయం వంటివాటిని పరిశీలించారు. 50 మందికి మించి విద్యార్థులున్న ప్రతి జూనియర్ కళాశాలకు పరీక్షా కేంద్రం మంజూరు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ఎంసెట్, నీట్ వంటి పోటీ పరీక్షలకు ఉపయోగపడేలా ప్రతి శనివారం సైన్స్ సబ్జెక్టులపై ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు. అవసరమైన స్టడీ మెటీరియల్ పుస్తకాలను ఇప్పటికే విద్యార్థులకు అందజేశారు.**

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 20, మోడల్ పాఠశాలలు 5, బీసీ సంక్షేమం కళాశాలలు 5, హైస్కూల్ ప్లస్ 7, సోషల్ వెల్ఫేర్ కళాశాలలు 8, కేజీబీవీలు 20, ప్రైవేటు జూనియర్ కళాశాలలు 77 వున్నాయి. వీటిల్లో ప్రస్తుతం ఇంటర్మీడియట్/ ఒకేషనల్ మొదటి సంవత్సరం విద్యార్థులు 13,589 మంది కాగా వీరిలో బాలురు 5,593 మంది, బాలికలు 7,996 మంది వున్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 16,179 మందికాగా వీరిలో బాలురు 6,893 మంది, బాలికలు 9,286 మంది ఉన్నారు. ఈ ఏడాది నుంచి ఆప్షనల్ సబ్జెక్టు విధానం అమల్లోకి రావడంతో పరీక్షలకు ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24 వరకు సుమారు నెల రోజులపాటు పరీక్షలు జరుగుతాయి. మొదటి సంవత్సరం విద్యార్థులు నూతన విధానంలో పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మాత్రం పాత విధానంలోనే పరీక్షలు రాస్తారు. ఇప్పుడు ఫస్టియర్‌లో వున్నవిద్యార్థులు ద్వితీయ సంవత్సరంలోకి వచ్చిన తరువాత కొత్త విధానంలో పరీక్షలు రాయాల్సి ఉంటుంది.

# మాకవరపాలెంలో డోజ్కో కంపెనీ

ఎర్త్ మూవర్స్ యంత్రాలు, విడిభాగాల తయారీ

- రూ.1,234 కోట్ల పెట్టుబడులు
- స్పీకర్ అయ్యన్నను కలిసిన కంపెనీ ఉన్నతాధికారులు



స్పీకర్ అయ్యన్నపాత్రుడుని కలిసిన డోజ్కో కంపెనీ జీఎం చంద్రశేఖర్, ఏజీఎం రామారావు

నర్సీపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలోని మాకవరపాలెం మండలంలో ప్రైవేటు రంగంలో 'ఎర్త్ మూవర్స్' యంత్రాలు, వాటి విడిభాగాలు తయరుచేసే పరిశ్రమ ఏర్పాటు కానున్నది. ఈ మేరకు ఝార్ఖండ్‌లోని ధన్‌బాద్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న 'డోజ్కో ప్రైవేటు లిమిటెడ్ కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం ఎంఓయూ చేసుకుంది. వంద ఎకరాల విస్తీర్ణంలో రూ.1,234 కోట్ల పెట్టుబడితో ఏర్పాటయ్యే ఈ కంపెనీ నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్టు తెలిసింది.

డోజ్కో కంపెనీ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) చంద్రశేఖర్, ఏజీఎం రామారావు గురువారం నర్సీపట్నం వచ్చి స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. నర్సీపట్నం నియోజక వర్గం మాకవరపాలెం మండలం ఇండస్ట్రియల్ హబ్‌గా మారుబోతున్నందుకు ఆనందంగా వుందన్నారు.

# చెరువులకు మహర్దశ

'ట్రిపుల్ ఆర్' పథకం కింద రూ.330 కోట్లతో అభివృద్ధి

- రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- జల వనరుల శాఖ సీఈ స్వర్ణకుమార్



రైవాడ జలాశయాన్ని పరిశీలిస్తున్న జల వనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ కేవీఎన్ స్వర్ణకుమార్

దేవరాపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో 'ట్రిపుల్ ఆర్' (రీకనస్ట్రక్షన్, రెనోవేషన్, రిహాబిలిటేషన్) పథకం కింద రూ.330 కోట్లతో సాగునీటి చెరువుల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపినట్టు జలవనరుల శాఖ ఉత్తరాంధ్ర చీఫ్ ఇంజనీర్ కేవీఎన్ స్వర్ణకుమార్ తెలిపారు. గురువారం ఆయన రైవాడ జలాశయాన్ని సందర్శించారు. అనంతరం దేవరాపల్లిలోని రైవాడ అతిథిగృహంలో మీడియాతో మాట్లాడారు. మొంథా తుఫాన్ కారణంగా అనకాపల్లి జిల్లాలో దెబ్బతిన్న జలవనరుల శాఖ పనులకు తాత్కాలిక మరమ్మతులకు రూ.2.48 కోట్లు, శాశ్వత మరమ్మతులకు రూ.42 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు. భారీ వర్షాలు కురిసి జలాశయాలు నిండితే.. స్పిల్‌వే గేట్లు ఎత్తడానికి అవసరమైన సిబ్బంది పూర్తిస్థాయిలో లేరని, ఆయా పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిపారు. 'జైకా' నిధులతో గతంలో చేపట్టిన రైవాడ కాలువల ఆధునికీకరణ పనులు చేయాలంటే రూ.43.8 కోట్లు అవసరమని, ఈ పనులు చేయడానికి 2028 వరకు గడువు వుండడంతో నిధుల విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు.

రైవాడ జలాశయం గట్టు పటిష్ఠత, కొత్త స్పిల్‌వే నిర్మాణం, గేట్లు ఏర్పాటు, పంట కాలువల ప్రధాన తూముల పునర్నిర్మాణ పనుల కోసం రూ.336 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, ఏ పథకం కింద నిధులు మంజూరు చేయాలన్నది ప్రభుతం పరిశీలనలో ఉందని చీఫ్ ఇంజనీర్ చెప్పారు. పెద్దేరు రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు ... మిగతా 8వ పేజీలో

# పక్వానికి చెరకు తోటలు

- సుక్రోజ్ 16 శాతం దాటితే లాభసాటిగా బెల్లం/ పంచదార తయారీ
- రిఫ్రాక్టోమీటర్‌తో నిర్ధారణ
- డాక్టర్ డి.ఆదిలక్ష్మి, చెరకు ప్రధాన శాస్త్రవేత్త



చెరకులో సుక్రోజ్ శాతాన్ని పరీక్షించడానికి వినియోగించే రిఫ్రాక్టోమీటర్



అనకాపల్లి అగ్రికల్చర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):

**జిల్లాలో చెరకు తోటలు పక్వానికి వచ్చినందున వాటిని నరికి బెల్లం తయారీకి లేదంటే షుగర్ ఫ్యాక్టరీలకు తరలించుకోవచ్చని అనకాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.ఆదిలక్ష్మి తెలిపారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడిన ఆమె.. చెరకు తోటల పక్వదశ, సుక్రోజ్ శాతం నిర్ధారణ, చెరకు కటింగ్, తదితర అంశాల గురించి వివరించారు.**



డాక్టర్ డి.ఆదిలక్ష్మి, చెరకు ప్రధాన శాస్త్రవేత్త

పక్వానికి చెరకులో సుక్రోజు శాతం అధికంగా ఉండి బెల్లం లేదా చక్కెర తయారీ లాభసాటిగా ఉంటుంది. రిఫ్రాక్టోమీటర్‌ను ఉపయోగించి పలుచోట్ల చెరకు తోటల్లో సుక్రోజును పరిశీలించగా 17 నుంచి 18 శాతం వరకు వుంది. సాధారణంగా సుక్రోజు 16 శాతం ఉంటే చెరకు తోటను నరికిగాను గాడించుకోవచ్చు. అయితే చెరకు తోటలను నరికేముందు పక్వ నిర్ధారణ తప్పనిసిరి. చక్కెర శాతంతోపాటు, రసశుద్ధి శాతం 85 నుంచి 90కి చేరితే చెరకు తోటలు నరికేందుకు అనుకూలంగా ఉంటాయి. చెరకు దిగుబడి ఎన్ని టన్నులు వచ్చిందన్న దానిపైనే రైతులకు ఆదాయం ఆధారపడి వుంటుంది. అదే షుగర్ ఫ్యాక్టరీల విషయానికి వస్తే సుక్రోజు శాతంపై ఆధారపడి ఉంటుంది. చెరకు దిగుబడి ... మిగతా 8వ పేజీలో

## విజయవంతంగా కార్తీక అన్నసమారాధన



శివలింగాన్ని దర్శించుకున్న ప్రముఖులు

మునగపాక, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీక అన్న సమారాధన నెల రోజులూ విజయవంతంగా సాగిందని వెంకటాపురం సర్పంచ్ సుందరపు నీలకంఠస్వామి అన్నారు. మండలంలో వెంకటాపురంలో 30 రోజులు కార్తీకమాసం అన్నసమారాధన కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు 1,500లకు పైగా భక్తులు అన్నప్రసాదం స్వీకరించారన్నారు. అనంతరం ఆలయంలో స్వయంభూ శివలింగానికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పారిశ్రామిక ప్రతినిధులు చందన ఆంజనేయ పట్టాభి రామేశ్వరరావు, పాపయ్యదొర, బొమ్మిరెడ్డిపల్లి శ్రీనివాసరావు, సాయివజ్రం, కాసులుబాబు పాల్గొన్నారు.

## నేడు టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్

ఎలమంచిలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తున్నట్టు ఏపీ ఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు తెలిపారు. కార్యకర్తల సమస్యలతో పాటు స్థానిక సమస్యలపై వినతులు స్వీకరిస్తామన్నారు.

## నూకాంబిక ఆలయంలో అమావాస్య పూజలు



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

ఎలమంచిలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నూకాంబిక అమ్మవారి ఆలయంలో గురువారం అమావాస్య పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్న సమారాధనలో ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు కమిటీ ప్రతినిధులు శ్రీరాములునాయుడు, లక్ష్మీనారాయణ, గంధం శివ, కమిటీ ప్రతినిధులు, సభ్యులు సేవలందించారు.

## ఉచిత వైద్య శిబిరంలో 350 మందికి పరీక్షలు

ఎస్.రాయవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారమ్మపాలెంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు 350 మంది రోగులకు మమతా హాస్పటల్ డాక్టర్లు విహారి, మంగాలక్ష్మి ఇరువురూ వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఆర్‌బీకే బోర్డు మారింది..




రైతు సేవా కేంద్రంగా సరిచేసిన వ్యవసాయశాఖ

ఎలమంచిలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ తెరువుపల్లిలో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం పేరు మారింది. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తతో వ్యవసాయాధికారులు స్పందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటినా సరే పేరు మార్చకపోవడంపై పలువురు విమర్శిస్తున్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. దీనిపై వ్యవసాయాధికారి మోహనరావు స్పందించి వెంటనే పేరును మార్పు చేయించారు.

## ఇరిగేషన్ కాలువ ఆక్రమణ తొలగించాలని వినతి

మునగపాక, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉమ్మలాడ గ్రామంలో ఇరిగేషన్ కాలువ ఆక్రమణలకు గురవుతోందని గ్రామస్థులు ఆరోపించారు. ఈ మేరకు గురువారం తహశీల్దార్ పి.సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మొల్లేటి నారాయణరావు మాట్లాడుతూ కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కాలువను మట్టితో పూడుస్తున్నారన్నారు. దీని వలన ఆయకట్టు రైతులకు సాగునీరు అందదన్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ. నాయుడు, కె.వెంకటేష్, రాజు, వినోద్, సత్తిబాబు పాల్గొన్నారు.

## ఘనంగా మరిడిమాంబ జాతర

ఎస్.రాయవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోముదేవుపల్లిలోని మరిడిమాంబ అమ్మవారి జాతరను గురువారం గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. జాతరను పురస్కరించుకొని గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## 'స్వామిత్వని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి'



కార్యక్రమంలో మాట్లాడుతున్న రంగనాయకులు

రాంబిల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న స్వామిత్వ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు అన్నారు. గురువారం హరిపురంలో జరిగిన స్వామిత్వ గ్రామసభలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తమ ఆస్తులపై చట్టబద్ధమైన హక్కులు పొందుతారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆస్తి పన్నుల సేకరణ మరింత సమర్థవంతంగా జరుగుతుందన్నారు. డీడీవో నాగలక్ష్మి స్వామిత్వ పథకం ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రాజు, పంచాయతీ సెక్రటరీ, సచివాలయం సిబ్బంది, టీడీపీ గ్రామ అధ్యక్షుడు డి.అప్పలనాయుడు, స్కూల్ చైర్మన్ డి.అప్పారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

**ఎస్.రాయవరంలో..**

మండలంలోని గుడివాడ, కర్రివానిపాలెం, పిట్లపాలెం గ్రామాల్లో గురువారం ఆయా గ్రామ సర్పంచుల అధ్యక్షతన స్వామిత్వ గ్రామ సభలు నిర్వహించారు. ఈ సభలకు ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ మాట్లాడుతూ నిబంధనల మేరకు గ్రామాల్లో గల ప్రతి ఇంటి కొలతలు శాస్త్రీయంగా తీసి యాజమాన్యం హక్కుల పత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ధూళి శ్రీనుబాబు, గ్రామ పెద్దలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఘనంగా సత్యసాయి సేవా దినోత్సవం

పాయకరావుపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సత్యసాయి శత వర్ష దినోత్సవాల్లో భాగంగా గురువారం సేవా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భజన మండలి సభ్యులు తుని లెప్రసీ కాలనీలో పేదలకు దుస్తులు, దుప్పట్లు, స్వీట్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో సత్యసాయి భజన మండలి కన్వీనర్ రమేష్‌బాబు, సభ్యులు యజ్ఞవల్క్యశర్మ, రమణరాజు, లక్ష్మీపతిరాజు, సూరవరాజు, శ్రీనివాస్, సాయికుమారి, సాయి సరోజ, రాధ, జగన్నాథరాజు, ఈశ్వరి పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా పాఠశాల శిథిల భవనాలు

- తొలగించాలని కోరుతున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు
- ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదన్న అరట్లకోట సర్పంచ్



ఈదటం జెడ్పీ పాఠశాలలోని శిథిల భవనం

పాయకరావుపేట రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరట్లకోట, ఈదటం పాఠశాలల్లోని భవనాలు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. శిథిల భవనాలు ఎప్పుడు కూలుతాయో.. ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు భయపడుతున్నారు. అరట్లకోట ఎంపీపీ పాఠశాల(స్పెషల్), ఈదటం జెడ్పీ ఉన్నత




అరట్లకోటలోని కూలడానికి సిద్ధంగా ఉన్న భవనం

పాఠశాలల ఆవరణలో ఉన్న భవనాలు పూర్తిగా శిథిల స్థితికి చేరుకున్నాయి. పిల్లలు ఆటలాడుకునే సమయంలో అటువైపు వెళితే ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయమేస్తుందని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శిథిల భవనాన్ని తొలగించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని అరట్లకోట సర్పంచ్ అప్పలనర్స ఆరోపించారు. ప్రమాదం వాటిల్లితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ప్రశ్నించారు. వర్షాలు కురిసే సమయంలో పిల్లలు అటువైపు వెళ్లకుండా ఎంతో జాగ్రత్తగా ఉంటున్నామని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిల భవనాల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# శుభ్రపడిన బీసీ కళాశాల బాలుర హాస్టల్

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన
- బాత్‌రూమ్‌లు, పరిసరాలు శుభ్రం
- పాడైన బోరు మరమ్మతులకు చర్యలు
- భవనాల మరమ్మతులకు రూ.17.5 లక్షలతో ప్రతిపాదనలు : ఏఈ సత్యస్వరూప్



బాత్‌రూమ్‌లు క్లీన్ చేయిస్తున్న వార్డెన్ అప్పలనాయుడు

పాయకరావుపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక లింగాలతోట కాలనీలో అపరిశుభ్రంగా ఉన్న బీసీ కళాశాల బాలుర వసతి గృహం గురువారం పరిశుభ్రంగా మారింది. వసతి గృహంలో అధ్వానంగా పారిశుధ్యం, రన్నింగ్ వాటర్ వృథా, వార్డెన్ అందుబాటులో లేక ఇష్టారాజ్యంగా విద్యార్థులు తదితర సమస్యలపై గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'వసతి లేని గృహం' శీర్షికన ప్రచురితమైన కథనంపై జిల్లా అధికారులు స్పందించారు. వారి ఆదేశాలతో ఇన్‌చార్జి వార్డెన్ అప్పలనాయుడు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఏఈ సత్యస్వరూప్ గురువారం వసతి గృహానికి చేరుకుని బాత్‌రూమ్‌లు, స్నానాల గదులు శుభ్రం చేయించారు. పాడైన ట్యాప్‌లు తొలగించి, కొత్తవి బిగించారు. వసతి గృహానికి నేమ్ బోర్డు తయారు చేసించి బిగించారు. అనంతరం ఏపీఈడబ్ల్యూఐడీసీ ఏఈతో కలిసి వసతి గృహంలో చేపట్టాల్సిన మరమ్మతులను గుర్తించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వార్డెన్ అప్పలనాయుడు మాట్లాడుతూ హాస్టల్‌లో ఉన్న అన్ని సమస్యలు పరిష్కరించడంతోపాటు పాడైన బోరుకు మరమ్మతులు చేపట్టడం కోసం ఎంపీడీఓకి వినతిపత్రం అందజేశామన్నారు. విద్యార్థులు స్టడీ అవర్స్ సక్రమంగా జరగడంతో పాటు రాత్రిపూట విద్యార్థులు బయటకు వెళ్లకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఏపీఈడబ్ల్యూఐడీసీ ఏఈ సత్యస్వరూప్ మాట్లాడుతూ వసతి గృహంలో పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టేందుకు రూ.17.5 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు విడుదలయ్యేలోగా అత్యవసరంగా చేయాల్సిన పనులు గుర్తించామని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు.

# మాక్ అసెంబ్లీకి ఎంపికైన జస్వంత్‌ని అభినందించిన ఎమ్మెల్యే



జస్వంత్‌ని అభినందిస్తున్న ఎమ్మెల్యే విజయ కుమార్

అచ్యుతాపురం/మునగపాక, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ఈనెల 26న జరిగే స్టూడెంట్స్ అసెంబ్లీ (మాక్ అసెంబ్లీ)కి ఎంపికైన మునగపాక మండలం గణపర్తి ఉన్నత పాఠశాలకు చెందిన నందారపు జస్వంత్‌ను గురువారం అచ్యుతాపురంలో గల తన స్వగృహంలో ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యాశాఖ విధాన రూపకల్పన, అసెంబ్లీ పనితీరులో ప్రత్యక్ష అనుభవాన్ని అందించడానికి ప్రభుత్వం ఈ సభను ఈనెల 26న నిర్వహిస్తోందన్నారు. దీనిలో భాగంగా విద్యార్థుల్లో రాజకీయ విలువలను ప్రోత్సహించడం, పౌరసత్వం, ప్రజాస్వామ్యం, పరిపాలన గురించి అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈకార్యక్రమంలో గణపర్తి ఉన్నత పాఠశాల హెచ్ఎం సీహెచ్ రోజమణి, టెక్కలి పరశురాం, కాళ్ల చంద్రమోహన్, మారిశెట్టి వెంకటరమణ, కర్రి వెంకునాయుడు, కాండ్రేగుల వెంకటరావు పాల్గొన్నారు.

# చెరకు రసంతో చంద్రబాబు చిత్రపటానికి అభిషేకం



ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి చెరకు రసంతో అభిషేకం చేస్తున్న ప్రగడ నాగేశ్వరరావు, భీమరశెట్టి శ్రీనివాసరావు

మునగపాక, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతు బాంధవుడని రాష్ట్ర రహదారులు అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం చంద్రబాబు చిత్రపటానికి చెరకు రసంతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిది దగా పాలన అన్నారు. ఆయన పాలనలో దుబారా తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో గవర, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్లు భీమరశెట్టి శ్రీనివాసరావు, డొక్కా నాగభూషణం, శ్రీకాళహస్తి బోర్డు డైరెక్టర్ బీలా స్రవంతి, దాడి శివ, శంకర్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 'ఆన్‌లైన్ ద్వారా ఇంటి పన్ను వసూలు చేయాలి'

ఎస్.రాయవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో చేపట్టిన ఇంటి పన్నుల వసూలు ప్రక్రియను ఆన్‌లైన్ పద్ధతిలో చేయాలని డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. గురువారం మండలంలోని చినఉప్పలం పంచాయతీ పరిధి పిట్లపాలెం గ్రామంలో చేపట్టిన ఇంటి పన్నుల వసూలును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కడైన కార్యదర్శులు ఆఫ్‌లైన్‌లో ఇంటి పన్నులు వసూలు చేసినట్టు తెలిస్తే, వారిపై కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పన్నుల వసూలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నాగరాజు, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

## 'ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి'

మునగపాక, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు పాలకవర్గాలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి పిలుపు నిచ్చారు. స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో గురువారం సర్పంచులు, ఉపసర్పంచులు, కార్యదర్శులకు ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. ఈవోపీఆర్డీ సోమరాజు మాట్లాడుతూ గ్రామం శుభ్రం, మురికినీరు రోడ్లపైకి రాకుండా అవసరమైన డ్రైనేజీలు, తాగునీరు, వీధిలైట్లు వంటి వసతులు కల్పనపై అవగాహన కల్పించామన్నారు.

## ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రేగుపాలెం ప్రమాద బాధితులు

ఎలమంచిలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రేగుపాలెం జంక్షన్ సమీపంలో హైవేపై బుధవారం రాత్రి లారీ, బైక్ ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన ఇద్దరు విశాఖ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు రూరల్ ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు. ప్రమాదంలో కొత్త ఎర్రవరానికి చెందిన సేనాపతి భాను, సేనాపతి చరణ్‌తేజలకు తీవ్ర గాయాలయ్యాయని, వీరికి అనకాపల్లి ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు. వీరిద్దరూ ద్విచక్రవాహనంపై తుని నుంచి అనకాపల్లి వైపు ప్రయాణిస్తుండగా ప్రమాదం జరిగిందన్నారు. పట్టణానికి చెం దిన సేనాపతి భాను ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడని, సేనాపతి చరణ్ తేజ 10వ తరగతి చదువుతున్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఉపేంద్ర తెలిపారు.

# నేటి నుంచి మార్గశిర మాసోత్సవాలు



విలేకర్లతో మాట్లాడుతున్న కమిటీ చైర్మన్ కొఠారు సాంబ

ఎలమంచిలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి ధర్మవరంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మార్గశిర మాసోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఉత్సవ కమిటీ చైర్మన్ కొఠారు సాంబ అన్నారు. గురువారం ధర్మవరంలోని కనకమ్మ ఆలయ ఆవరణలో సమవేశమైన ఉత్సవ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబరు 21వ తేదీ నుంచి డిసెంబరు 19వ తేదీ వరకూ ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఆలయ వ్యవస్థాపకులు స్వర్గీయ కొఠారు రాంబాబు కుటుంబీకులచే తొలి పూజ చేయించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఆలయ పురోహితులు వి. కోటేశ్వర కుమార్ పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రతి వారం అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అని ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు కొఠారు కొండబాబు, రాము, కొఠారు నరేష్, ఏబీవీఎల్.రాజు, నాని, ప్రకాష్ పాల్గొన్నారు.

## దిమిలిలో పీఎం కిసాన్ సదస్సు




కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త గౌరీ

రాంబిల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దిమిలి గ్రామంలో గురువారం ఇండియన్ పొటాష్ లిమిటెడ్ (ఐపీఎల్) ఆధ్వర్యంలో పీఎం కిసాన్‌పై శాస్త్రవేత్తలు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి గ్రామీణ రైతు పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త గౌరీ సమతుల్య ఎరువుల వాడకం, పంట ఉత్పాదక పెంపు, నేల ఆరోగ్యం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. హరిపురం బీసీటీ కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శ్రీహరిరావు నేల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. కార్యక్రమంలో ఏవో సుమంత, దిమిలి మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ప్రకాష్‌రావు, ఐపీఎల్ ఎంఒ కార్తీక రెడ్డి, 100 మంది రైతులు పాల్గొన్నారు..

## విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన అవసరం : సీఐ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ చంద్రశేఖర్

అచ్యుతాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన అవసరమని సీఐ ఆర్‌వీఎస్ఎస్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం పూడిమడక ఉన్నత పాఠశాలలో చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. తప్పుచేసిన వారు చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకోలేరని, ఈ విషయాన్ని విద్యార్థులు ఆకలింపు చేసుకోవాలన్నారు. చ ఈసందర్భంగా పూడిమడకలో ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ సుధాకర్, పాఠశాల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థులకు అభ్యాసన సామగ్రి వితరణ



అభ్యాసన సామగ్రి అందజేస్తున్న ఉపాధ్యాయుడు రాజాన అప్పలనాయుడు

ఎస్.రాయవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారం జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు రాజాన అప్పలనాయుడు గూడెం కొత్తవీధి మండలంలోని గిరిజన విద్యార్థులకు అవసరమైన రూ.ఐదు వేలు విలువ చేసే అభ్యాసన సామగ్రిని గురువారం పీఆర్‌టీయూ మండల బృందానికి అందజేశారు. సేకరించిన అభ్యాసన సామగ్రిని త్వరలో గిరిజన విద్యార్థులకు అందజేస్తామని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు తెలిపారు.

## అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు

అచ్యుతాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్మిక సమస్యల పరిష్కారానికి జరిగే అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు అన్నారు. గురువారం అచ్యుతాపురం సెజ్ కర్మాగారాల్లో పనిచేస్తున్న కార్మికులతో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. విద్యుత్తు, బ్యాంకులు తదితర సంస్థల్లో ప్రైవేటీకరణ విధానాలను అమలుచేయటానికి తీవ్రంగా కృషిచేస్తోందన్నారు. ఇందులో భాగంగానే పారిశ్రామికవేత్తలకు మేలు చేకూరే విధంగా కార్మిక హక్కులు కాలరాసే విధంగా లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. కార్మికుల సంక్షేమం కోసం డిసెంబరు 31 నుంచి 2026 జనవరి నాలుగు వరకు విశాఖలో జరిగే ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రొంగలి రాము, తాతారావు, ఎస్.రాము, నర్శింగరావు పాల్గొన్నారు.

# గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

- జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్..
- ఘనంగా ముగిసిన వారోత్సవాలు



ఎలమంచిలిలో విజేతలకు బహుమతులు అందజేసిన కమిషనర్ ప్రసాదరాజు, పౌరసేవా సంఘం అధ్యక్షుడు పుల్లా వెంకట్రావు

పాయకరావుపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్ అన్నారు. గురువారం స్థానిక శాఖా గ్రంథాలయంలో జరిగిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలోఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మాటా ్డడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకు నేందుకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడ తాయన్నారు. అనంతరం పలువురుని ఘనంగా సత్కరించారు. రిటైర్డ్ లైబ్రేరియన్ మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 రమేష్‌బాబు, ఎస్ఐ పురుషోత్తం, గ్రంథాలయ కమిటీ సభ్యులు ఎన్‌టీ. సీతారామమూర్తి, కంభంపాటి వెంకటరమణ, ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

**అచ్యుతాపురంలో..**

పుస్తక పఠనం ద్వారా జ్ఞానం పెంపొందించుకోవచ్చని ఎంపీడీఓ బి. చిన్నారావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు లోకజ్ఞానం కూడా అవసరమన్నారు. అనంతరం వివిద పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అచ్యుత విద్యా సంస్థల కరస్పాండెంట్ పల్లి శేషగిరిరావు, ఎంఈఓ సీకే దేవరాయలు, విశ్రాంత హెచ్ఎం కుసుమ కుమారి, గ్రంథాలయాధికారి ఎల్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

**ఎలమంచిలిలో..**

విద్యార్థి దశ నుంచి గ్రంథపఠనంతో ఉన్నత శిఖరాలను అధిరోహించిన వారెందరో ఉన్నారని మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, పౌరసేవా సంఘం అధ్యక్షుడు పుల్లా వెంకట్రావు అన్నారు. గురువారం స్థానిక శాఖా గ్రంథాలయ ఆవరణలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీ పరీక్షలకు గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయన్నారు. అనంతరం కొక్కిరాపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్తేరు రాణి, విశ్రాంత అధ్యాపకులు ఆడారి పూరి జగన్నాథం, వనుం నాగేశ్వరరావు గ్రంథాలయాల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పోటీల విజేతలకు వక్తలు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి. ఆనంద్, విశ్రాంత ఉపాధ్యాయులు, సీనియర్ సిటిజన్స్ షేక్ అబ్దుల్లా, పాపారావు, సూరిబాబు, సత్యారావు, ఫిజికల్ డైరెక్టరు కొఠారు దుర్గారావు, సిబ్బంది పాల్గొన్నారు.

**రాంబిల్లిలో..**

మండలంలోని దిమిలి శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కె.లక్ష్మి మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థులు, నిరుద్యోగుల భవితకు మంచి మార్గాన్ని చూపిస్తాయన్నారు. అనంతరం వివిధపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం శాస్త్రి, గ్రామ పెద్దలు ఎస్.నాయుడు, పంచాయతీ సెక్రటరీ అమ్మాజీ, గ్రంథాలయం అధికారిణి శకుంతల పాల్గొన్నారు.

**నక్కపల్లిలో..**

స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. గురువారం జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ ఎన్.జయరత్నకుమారి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ బాలికల గురుకులం ప్రిన్సిపాల్ ఉషారాణి, గ్రంథాలయాధికారి గోవింద ఈశ్వరరావు, ఉపాధ్యాయులు టీవీ రమణ, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు. అలాగే చినదొడ్డిగల్లులో గ్రంథాలయాధికారి కె.జనార్దన్ ఆధ్వర్యంలో వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. ముఖ్య అతిథిగా ట్రైనీ ఎస్ఐ సాహిమాఅంజుమ్ హాజరై విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా వుండాలని సూచించారు. బీజేపీ నేత గట్టెం నానాజీ, వేణుగోపాల్‌రాజు,అమలకంటి శ్రీను, వీరబాబు, హెచ్ఎంలు బీ శివప్రసాద్, పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**కోటవురట్లలో..**

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని జెడ్‌పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి అన్నారు. గురువారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ముగింపు సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులకు ఉపయోగపడే విధంగా ఇంగ్లీషు మీడియం అందుబాటులోకి వచ్చిందన్నారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు మాట్లాడుతూ ప్రతిరోజూ దినపత్రికలు చదవడం వల్ల విజ్ఞానం పెరుగుతుందన్నారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, హెచ్ఎంలు ఎస్.సుకుమార్, నిర్మల, లైబ్రేరియన్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

## కూటమి సారథుల చిత్రపటాలకు పాలాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

కొత్తూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అన్నదాన సుఖీభవ- పీఎం కిసాన్ రెండో విడత నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసినందుకు కృతజ్ఞతగా ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్‌ల చిత్రపటాలకు అనకాపల్లి మండలం కూండ్రం గ్రామంలో గురువారం టీడీపీ నాయకులు, రైతులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమన్నారు. ఇందులో భాగంగానే వివిధ పథకాలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. రైతులంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నందారపు సూరిబాబు, మరపురెడ్డి సత్యనారాయణ, రొంగలి సూరిబాబులతో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి థాంగ్ టా పోటీలకు 24మంది ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన వారితో ఎస్‌జీఎఫ్, థాంగ్ టా క్రీడా ప్రతినిధులు

పరవాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి థాంగ్ టా పోటీలు గురువారం ఉత్సాహంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి సుమారు 120 మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. అండర్-14, 17 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా ఈ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన 24 మంది విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సత్యవతి, శ్రీదేవి, శ్రావణి, షెల్టన్ జేమ్స్, థాంగ్ టా క్రీడా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే వినతుల స్వీకరణ

కొత్తూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పట్టణంలోని జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ వినతులు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రజల విచ్చేసి తమ సమస్యలను విన్నవించారు. పలువురితో ఆయన స్వయంగా మాట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం వాటిపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపేందుకు కృషి చేయాలన్నారు. గృహ నిర్మాణ శాఖ అధికారులతో మాట్లాడి నియోజకవర్గంలో ఉన్న ఇళ్ల జాబితాను పరిశీలించారు.

## పిల్లల దత్తతపై రైల్వే స్టేషన్‌లో అవగాహన




అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న బాలల సంరక్షణ విభాగం ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో పిల్లల దత్తతపై స్థానిక రైల్వే స్టేషన్‌లో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ చట్టపరంగా పిల్లలను దత్తత ఎలా తీసుకోవాలో వివరించారు. సున్నా నుంచి పద్ధెనిమిదేళ్లలోపు బాల బాలికలు, అభాగ్యులు, అనాథలు ఉంటే అటువంటి వారిని ప్రత్యేకత ఏజెన్సీకి తెలియజేయాలన్నారు. అనంతరం బాలల హక్కులు గురించి వివరించారు. బాల బాలికలకు ఎటువంటి సమస్యలు ఉన్నా 1098 నంబర్‌కి కాల్ చేసి తెలియజేయాలని ఆమె సూచించారు. అంతకుముందు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ కె.రామకృష్ణ, శ్రీదేవి, లక్ష్మి, డీసీపీయూ సిబ్బంది, సామాజిక కార్యకర్తలు, ఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన సహకార సంఘం వారోత్సవాలు

లంకెలపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో సంస్థ వారోత్సవాల ముగింపు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నేతలు సంఘం కార్యదర్శి సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. సహకార సంఘాల ద్వారా రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొండా అప్పారావు, దానబాల అప్పలనాయుడు, బి.సత్యనారాయణ, బండారు చందూ రమేశ్, హనుమంతురావు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఖోఖోకు 'ఏఎంఏఏ' విద్యార్థిని ఎంపిక

కొత్తూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన అండర్ -14 ఖోఖో జిల్లా జట్ల ఎంపికలో అనకాపల్లి ఏఎంఏఏ హైస్కూల్ విద్యార్థిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయిని కె.లావణ్య తెలిపారు. ఈ మేరకు ఈ నెల 28 నుంచి 30 వరకు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న కొణతాల హిరణ్యావర్ణ తలపడనున్నట్టు చెప్పారు. ఆమెను పాఠశాల అధ్యక్షుడు గ్రంధి సత్యసురేష్, కరస్పాండెంట్ కొణతాల శివకుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.



హిరణ్యావర్ణ

# ఉత్తమ పంచాయతీలో 'కొణతాల' పర్యటన

▸▸ తగరంపూడి అభివృద్ధిపై అధికారులతో సమీక్ష ▸▸ అంగన్‌వాడీ భవన ప్రారంభానికి ఆహ్వానించలేదని ఎంపీపీ, వైస్ ఎంపీపీ అసంతృప్తి

కొత్తూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉత్తమ పంచాయతీగా ఎంపికైన అనకాపల్లి మండలం తగరంపూడిలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రైతు భరోసా కేంద్రం, పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రం, హెల్త్ సబ్ సెంటర్, రోడ్లు, శారదానది గట్లను పరిశీలించారు. గ్రామంలో సోలార్ విద్యుద్దీపాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామా నికి అవసరమైన అభివృద్ధిపై అధికారులు, నాయకులతో సమీక్షించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, గ్రామంలో పాడుబడిన భవనంలో అంగన్‌వాడీ పిల్లలకు తరగతులు జరగడం చూసి నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే కొణతాల మధ్యాహ్నం ప్రారంభించారు. తగరంపూడి గ్రామం జాతీయ ఉత్తమ పంచాయతీగా ఎంపికైన సందర్భంగా వచ్చిన కోటి రూపాయల నిధులు సద్వినియోగపరిచే విధంగా చూడాలని అధికారులు, నాయకులతో సమీక్షించి పలు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా పంచాయతీ అధికారి సందీప్, సర్పంచ్ యాదగిరి అప్పారావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు భరత్‌బాబు, పంచాయతీరాజ్ డీఈ వేణుగోపాల్, ప్రాజెక్టు డీఈ శక్తికుమారి, తహశీల్దార్ ఆనంద్, ఎంపీడీవో ఆశాజ్యోతి, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి వెంకట సన్యాసినాయుడు, తుమ్మపాల ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ హిమబిందు పాల్గొన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

**ప్రొటోకాల్ ఉల్లంఘించారని కలెక్టర్‌కు ఫిర్యాదు**

అనకాపల్లి: అనకాపల్లి మండలం తగరంపూడిలో మండల పరిషత్ నిధులు రూ.5.6 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవన ప్రారంభోత్సవానికి తమను పిలవకుండా ప్రొటోకాల్ ఉల్లంఘించారంటూ మండల అధికారులపై ఎంపీపీ గొర్లె సూరిబాబు, వైస్ ఎంపీపీ ఐతా రాము గురువారం కలెక్టర్ విజయకృష్ణన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మీడియాకు ఆ ప్రకటన విడుదల చేశారు. తగరంపూడిలో ఎంపీపీ నిధులతో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని గురువారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ద్వారా కొబ్బరికాయ కొట్టించి అధికారులు ప్రారంభోత్సవం చేయించారు. అయితే ఈ కార్యక్రమానికి ప్రొటోకాల్ ప్రకారం ఎంపీపీ గొర్లె సూరిబాబు, తగరంపూడి ఎంపీటీసీ సభ్యుడు, వైస్ ఎంపీపీ ఐతా రాము ఎంపీడీవో, సీడీ పీవో, మండల ఇంజినీర్లు పిలవాల్సి ఉండగా మూడు శాఖల అధికారులు కనీసం ఎంపీపీని, వైస్ ఎంపీపీని కార్యక్రమానికి ఆహ్వానించకుండానే ప్రారంభించారు. దీనిపై ఎంపీపీ సూరిబాబు, వైస్ ఎంపీపీలు విచారణ జరిపించి అధికారులపై చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

## గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

▸▸ 'మన పల్లెకు- మన ఎమ్మెల్యే'లో పంచకర్ల రమేశ్‌బాబు

పరవాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు స్పష్టం చేశారు. 'మన పల్లెకు- మన ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన కలపాక, భరణికం, తానాం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా తానాం గ్రామానికి ఏలేరు కాలువ ద్వారా రాంకీ యాజమాన్యం తాగునీరు సరఫరా చేయలని, ఫార్మా వ్యర్థ జలాలను నిల్వ చేయడం కోసం రాంకీ యాజమాన్యం తవ్విన రెండు చెరువులను తక్షణమే పూడ్చి వేయించాలని, అలాగే చదువుకున్న నిరుద్యోగ యువతకు ఎన్టీపీసీ, హిందూజా, ఫార్మాసిటీలో ఉపాధి కల్పించాలని కోరారు. భరణికంలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, క్షత్రియ కులస్థులకు చెందిన శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని, గ్రామంలో కల్యాణ మండపం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, కలపాకలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటుతో పాటు క్రీడాకారుల కోసం మైదానం, సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని విన్నవించారు. సమస్యలన్నింటిని తొందరలోనే పరిష్కారిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.నాగరాజు, ఎంపీడీవో బి.రమేష్‌నాయుడు, సర్పంచ్ కన్నూరు దేవి, మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కన్నూరు వెంకటరమణ, కూటమి నాయకులు నగిరెడ్డి చిన్నారావు, ఇందల కొండలరావు, బొండా తాతారావు, బొండా సన్నిదేముడు, వర్రి పరదేశినాయుడు, బొడ్డపు శ్రీనివాసకాసులు, చింతకాయల ముత్యాలు, మోటూరు సన్యాసినాయుడులతో పాటు అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.



కలపాకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

# ప్రజల భాగస్వామ్యంతోనే మాదకద్రవ్యాల నిర్మూలన

▸▸ విద్యార్థుల అవగాహన సదస్సులో డీఎస్పీ విష్ణుస్వరూప్

▸▸ సబ్బవరం చేరిన పోలీసుల చైతన్య యాత్ర



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ విష్ణుస్వరూప్

సబ్బవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజల భాగస్వామ్యంతోనే మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యమని పరవాడ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్ అన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు జరుగుతున్న అభ్యుదయం సైకిల్ యాత్ర గురువారం సబ్బవరం చేరుకుంది. ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, స్థానికులు కోలాటం, డ్యాన్స్‌లు తదితరాలతో కోలాహల వాతావరణం నడుమ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివిధ కళాశాలల విద్యార్థులతో ఏర్పాటైన అవగాహన సదస్సులో డీఎస్పీ మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై బాధ్యతతో వ్యహరించాలని, వారి నడవడికను అంచనా వేయాలని సూచించారు. స్నేహితుల ఒత్తిడి, నిరుద్యోగం, మానసిక ఒత్తిళ్ల కారణంగా యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని వివరించారు. డ్రగ్స్, గంజాయి కేసుల్లో పట్టుబడితే జీవితంలో యువతకు ఉద్యోగాలు దక్కవని గుర్తించాలన్నారు. విద్యార్థులు బెట్టింగ్ యాప్స్‌నకు దూరంగా ఉండాలన్నారు. పోక్సో కేసుల్లో ఇరుక్కోవద్దని సూచించారు. ఇది కూడా గంగజాయి కేసు అంతటి ప్రమాదకరమైనదిగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ విద్యార్థుల 'మార్పు' నాటిక ఆలోచింపజేసింది. అనంతరం అందరితో మాదకద్రవ్యాలకు వ్యతిరేకం అంటూ ప్రతిజ్ఞ చేయించారు. చివరిగా ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ర్యాలీ నిర్వహించి సైకిల్ యాత్రకు వీడ్కోలు పలికారు. సీఐ జి.రామచంద్రరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, తహశీల్దార్ బి.చిన్నికృష్ణ, ఎంపీ డీవో పి.పద్మజ, ఎంఈవో లక్ష్మణరావు, రవీంద్రబాబు, సర్పంచ్‌లు దెడ్డం ప్రసాదరావు, పడాల వెంకటరమణ, ఆకుల గణేశ్, ఎంపీటీసీ సింగంపల్లి శ్రీను, బ్రహ్మకుమారీస్ బృందం, పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్న దృశ్యం

# మత్స్యకారులకు ఉపాధి కల్పించకుంటే ఫార్మాసిటీ ముట్టడి

▸▸ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాలు



మాట్లాడుతున్న పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాలు

పరవాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ముత్యాలమ్మపాలెం పంచాయతీ పరిధిలోని మత్స్యకారులకు ఫార్మాసిటీలో తక్షణమే ఉపాధి అవకాశాలు కల్పించాలని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు డిమాండ్ చేశారు. గురువారం ముత్యాలమ్మపాలెంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉపాధి కల్పించకపోతే ఫార్మాసిటీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఫార్మా కాలుష్యం నుంచి మత్స్య సంపదను కాపాడాలని గతంలో రాంకీ ప్రధాన ద్వారం వద్ద మత్స్యకారులు పెద్ద ఎత్తున ధర్నా, ఆమరణ నిరాహార దీక్ష చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఫార్మాసిటీలో 500 మంది మత్స్యకారులకు రాంకీ యాజమాన్యం ఉపాధి అవకాశాలు కల్పించాలని ఒప్పందం కూడా చేయడం జరిగిందన్నారు. ఇప్పటికీ రాంకీ యాజమాన్యం సదరు మత్స్యకారులకు ఉపాధి కల్పించడంలో విఫలమైందని ఆరోపించారు. తక్షణమే ఉపాధి అవకాశాలు కల్పించకపోతే రాంకీ కార్యాలయం ప్రధాన గేటు వద్ద ఆందోళన చేపట్టడంతో పాటు ఫార్మాసిటీని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సర్పంచ్ చింతకాయల సుజాత, కో-ఆప్షన్ సభ్యుడు మైలపల్లి అప్పన్న, స్థానిక నాయకులు అర్జిల్లి రవి, చింతకాయల అమ్మోరు, కొవిరి రాయుడు, సూరాడ ముత్యాలరావు, ఒలిశెట్టి అప్పలరాజు, సమ్మంగి సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నెమలి పింఛాల అలంకరణలో నూకాంబిక అమ్మవారు



నెమలి పింఛాల అలంకరణలో అరుంధతినగర్‌లోని నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం అమావాస్య సందర్భంగా గురువారం పట్టణంలోని గవరపాలెం అరుంధతీనగర్ గల నూకాంబిక అమ్మవారిని నెమలి పింఛాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రతి అమావాస్యకు అమ్మవారిని వివిధ రూపాల్లో అంకరిస్తుండడం ఇక్కడ ఆనవాయితీ. ఈసారి అమ్మ నెమలి పింఛాల అలంకరణలో దర్శనమివ్వడంతో పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కొణతాల జగన్నాధరావు నాయుడు, నిర్వాహకులు పెట్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలి'



మాట్లాడుతున్న మంజు, మహిళా ప్రతినిధులు

అనకాపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లే బాధ్యత ప్రతి కార్యకర్త, నాయకులపై ఉందని తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు అన్నారు. గురువారం ఆమె అనకాపల్లిలోని టీడీపీ పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో భాగంగా పీఎం మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల నేతృత్వంలో సూపర్ సిక్స్ హామీలన్నిటినీ అమలు చేస్తూ ముందుకు వెళుతున్నామని తెలిపారు. విశాఖపట్నంలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సుకు విశేష స్పందన వచ్చిందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి విజనరీ నేత చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి అనేక దిగ్గజ కంపెనీలు రాష్ట్రానికి వస్తున్నాయని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ స్థాయిలో ప్రతి మహిళా కార్యకర్త సంక్షేమ కార్యక్రమాలను వివరించాలన్నారు. ఈ సమావేశంలో అనకాపల్లి జిల్లా పార్లమెంటరీ పార్టీ మహిళా విభాగం కార్యదర్శి, జడ్పీటీసీ సభ్యురాలు సుఖల రమణమ్మ, ప్రతినిధులు వేదల సూర్యప్రభ, బత్తుల లక్ష్మి, పోతల రమణమ్మ, హేమ, భారతి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

## వీరబ్రహ్మేంద్ర ఆలయంలో పూజలు

తుమ్మపాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గవరకార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్రతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భారీ అన్నసమారాధనను నిర్వహించారు. టీడీపీ 82వ వార్డు ఇన్‌చార్జి పోలారపు త్రినాథ్, నాయకులు భానుచందర్, కోట్ని రియాజ్, జొన్నాడ సురేష్, ఆలయ కమిటీ సభ్యులు వేణుగోపాల్, త్రినాథ్, మత్తుర్తి మహేష్, బోసుబాబు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు అందినట్టు ఎస్‌ఐ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక మళ్ల వీధిలో నివాసముంటున్న కొలగట్ల సునీల్ అనే వ్యక్తి అచ్యుతాపురం ప్రైవేటు కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడన్నారు. రోజూ మాదిరిగానే బుధవారం విధులకు వెళ్లి రాత్రి ఏడు గంటల సమయంలో జాగ్రత్తగా ఉండాలని భార్య స్వప్న సెల్ ఫోన్‌కు మెసేజ్ పెట్టాడన్నారు. సెల్ స్విచాఫ్ చేసి ఉండడంతో ఆమె ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామన్నారు.

# చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

▸▸ అనకాపల్లి, పరవాడ సీఐలు వెంకటనారాయణ, మల్లికార్జునరావు



అనకాపల్లిలో విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ వెంకట నారాయణ

అనకాపల్లి టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ సూచించారు.స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో గురువారం ట్రాఫిక్ నియమాలు, కొత్త నేర చట్టాలపై ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలన్నారు. ద్విచక్ర వాహనాల పై వెళ్లేటప్పుడు సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయకూడదని స్పష్టం చేశారు. 18 ఏళ్ల లోపు విద్యార్థులు ద్విచక్ర వాహనాలు నడపరాదని సూచించారు. అలా నడపడం వల్ల జరగరాని ప్రమాదం జరిగితే ఎదుటి వారి జీవితాలు దుర్భరంగా మారడంతో పాటు మైనర్‌గా వాహనం నడిపినందుకు శిక్షపడుతుందని వివరించారు. దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలు బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎస్ఏ గురించి విద్యార్థులకు వివరించారు. ట్రాఫిక్ ఎస్ఐ శేషగిరిరావు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.



దేశపాత్రునిపాలెంలో మాట్లాడుతున్న పరవాడ సీఐ మల్లికార్జునరావు

**దేశపాత్రునిపాలెంలో...**

పరవాడ : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీఐ ఆర్.మల్లికార్జునరావు సూచించారు. జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెంలో గురువారం రాత్రి చట్టాలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. నూతన క్రిమినల్ చట్టాల గురించి వివరించారు. ఐపీసీ, సీఆర్‌పీసీ, ఐఈఏ స్థానంలో బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎస్ఏ నూతన చట్టాలు అమల్లోకి వచ్చాయన్నారు. మహిళల భద్రత, సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిళ్లా శివకృష్ణ, లక్కరాజు శ్రీనివాస్, ఎన్.జనార్ధనరావు, ఎ.గోపి, సంజీవమ్మ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

అనకాపల్లి టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ముగింపోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఖజానా అధికారిణి వి.లక్ష్మీ సుభాషిణి మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందించే దేవాలయాలుగా పేర్కొన్నారు.. ప్రతి ఒక్కరూ విరామ సమయాల్లో గ్రంథాలయాలకు వచ్చి తమకు నచ్చిన మంచి పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని, మేధస్సును పెంపొందించుకోవాలన్నారు. శారదా గ్రంథాలయం అధినేత కోరుకొండ బుచ్చిరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ బల్లా నాగభూషణం మాట్లాడుతూ ఇక్కడ వారోత్సవాల నిర్వహించడంలో ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు దాతల సహకారం ఎంతో ఉందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు లక్ష్మీసుభాషిణి, బుచ్చిరాజు చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, మెమొంటోలు అందజేశారు. జిల్లా గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిన ఈ కార్యక్రమంలో చక్రపాణి, జీవీఎన్ శాస్త్రి, కె.మల్లికార్జునరావు, జీఎస్‌కే సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాల : గ్రంథాలయ వారోత్సవాలు తుమ్మపాల గ్రంథాలయంలో ముగిశాయి. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతో పాటు స్టడీ మెటీరియల్ అందజేశారు. జడ్పీహెచ్ స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ పెతకంశెట్టి బలరాం, స్థానిక నాయకులు అప్పారావు, మధు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : మండల కేంద్రం పరవాడ శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ముగింపు వేడుకల్లో కాండ్రేగుల వెంకటరామారావు, ఎం.సన్యాసిరావు హాజరై మాట్లాడారు. గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాభివృద్ధి పెంపొందించుకోవచ్చునన్నారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.వి.లక్ష్మణరావు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



అనకాపల్లి శాఖా గ్రంథాలయంలో బహుమతులు పొందిన విద్యార్థులు

కశింకోట : తాళ్లపాలెం శాఖా గ్రంథాయంలో వారోత్సవాలు ముగిశాయి. అనకాపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కర్రి సత్యనారాయణ మాట్లాడారు. గ్రంథాలయాలు విజ్ఞాన సముపార్జనకు మార్గాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. టీడీపీ నాయకులు ఉల్లింగల రమేష్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.ప్రసాద్, గ్రంథాలయాధికారి కె.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : గ్రంథాలయాలను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి పిలుపునిచ్చారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగిసిన సందర్భంగా మాట్లాడారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారిణి శిరీషా, సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఎంఈవో రవీంద్రబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల స్కూటీలకు దరఖాస్తులు ఆహ్వానం



విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అధికారి కవిత

పాడేరురూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మోటారు స్కూటీ (మూడు చక్రాల వాహనాలు)ల కోసం దివ్యాంగులు ఆన్‌లైన్‌లో ఈ నెల 25వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కె.కవిత కోరారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం నియోజకవర్గానికి 10 మంది దివ్యాంగులకుమూడు చక్రాలవాహనం (స్కూటీ)లు మంజూరు చేసిందన్నారు. వీటి కోసం దరఖాస్తు చేసుకోదలచిన అభ్యర్థులు దరఖాస్తు చేసే నాటికి 18 ఏళ్ల దాటి 45 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలని, సదరం ధృవీకరణ పత్రం ప్రకారం కాళ్లలో (లోయర్ లింబ్స్) వైకల్యం 70 శాతం అంత కంటే ఎక్కువ కలిగి ఉండాలని, కుటుంబ వార్షిక ఆదాయం రూ. 3 లక్షలకు మించకూడదన్నారు.

## చౌడుపల్లి-2 సచివాలయం వెటర్నరీ అసిస్టెంట్ మృతి



సికిల్ సెల్ ఎనీమియాతో మృతి చెందిన అరుణకుమారి(ఫైల్)

గూడెంకొత్తవీధి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలం చౌడుపల్లి గ్రామ సచివాలయం-2లో పనిచేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ కంకిపాటి అరుణకుమారి (28) సికిల్ సెల్ ఎనీమియాతో బాధపడుతూ స్వగ్రామం కొత్తగూడెంలో మృతి చెందారు. గూడెంకొత్తవీధిమండలం కొత్తగూడెంనకు ఆమె చెందిన కొంతకాలంగా సికిల్ సెల్ ఎనీమియాతో బాధపడుతున్నది. బుధవారం సాయంత్రం విధులు ముగించుకుని గృహానికి వచ్చిం ది. గురువారం ఉదయం అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తుండగా ఆమె తుది శ్వాసవిడిచారు. ఆమె మృతికి స్థానిక ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి, గ్రామ సచివాలయ ఉద్యోగులు సానుభూతిని వ్యక్తం చేశారు.

## 'ఉపాధ్యాయుల ఆత్మగౌరవం దెబ్బతీసేలా ఆదేశాలు తగదు'

పాడేరురూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల ఆత్మగౌరవం దెబ్బతీసే విధంగా ఉన్న గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆదేశాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంఘం జిల్లా అధ్యక్షుడు వి.మహేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ అల్లూరి జిల్లా ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ యాజమాన్యంలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు స్టడీ అవర్ పేరుతో పాఠశాలల్లో అర్ధరాత్రి 12 గంటలకు ముఖ హాజరు వేయాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. వాచ్‌మేన్ తరహాలో ఈ ఆదేశాలతో ఉపాధ్యాయుల ఆత్మగౌరవం దెబ్బతింటుందన్నారు. ఉపాధ్యాయులను మానసిక వత్తిడికి గురిచేయడం వల్ల నష్టం జరుగుతుందన్నారు. స్వేచగా పాఠాలు బోధించే వాతావరణం కల్పించకపోవడం సమాజ హితం కాదన్నారు. ఉపాధ్యాయుల మనోభావాలను దృష్టిలో పెట్టుకొని గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఇచ్చిన ఆదేశాలను నిలుపు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## బాలల హక్కుల దినోత్సవం



అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

అనంతగిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):మండలంలోని చిలకలగెడ్డ మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో గురువారం బాలల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కిల్లో నోకుల్ మాట్లాడుతూ... బాల్యం ఆనందంగా సాగేలా చూడడంతోపాటుగా వారు ఎదగాలనే తపన కలిగిన వాతావరణాన్ని కల్పించాలని కోరారు. చిన్నారులు సమాజానికి, దేశానికి ఎంతో విలువైన సంపదని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరాజీ మల్లేశ్వరరావు, శ్రీదేవి, లక్ష్మణమ్మ, పాల్గొన్నారు.

## అడుగడుగునా వాహన తనిఖీలు



ముంచంగిపుట్టులో గురువారం రాత్రి వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

ముంచంగిపుట్టు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి జోలాపుట్టు, సంగడ, కుమడ, పెదబయలు తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారుల వెంట గురువారం పోలీసులు బలగాలు విస్తృత వాహన తనిఖీలు చేపడుతున్నారు. జిల్లా సరిహద్దు అటవీ ప్రాంతాల్లో మావోయిస్టులతో వరుస ఎదురుకాల్పుల నేపథ్యంలో అప్రమత్తమయ్యారు. ఎస్ఐ జె.రామక్రిష్ణ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ బలగాలు స్థానిక నాలుగు రోడ్ల కూడలితో పాటు ప్రధాన జంక్షన్ల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు గస్తీ నిర్వహిస్తున్నారు.వాహనాలను, ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా తనిఖీలు చేపడుతున్నారు. రాత్రి 11 గంటలు దాటిన తరువాత అనవసరంగా బయట సంచరించే వారిని విచారించి విడిచిపెడుతున్నారు.

## రొంపిల్లిలో హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎం లేక ఇక్కట్లు

అనంతగిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపల్లి పంచాయతీలో హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎంను వెంటనే నియమించాలని సర్పంచ్ చిరంజీవి కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడు తూ, ఇటీవల బదిలీపై ఇద్దరు ఉద్యోగులు వెళ్లిపోయారని, అయితే వారిస్థానంలో కొత్త వారు బాధ్యతలు చేపట్టకపోవడంతో ప్రజలకు వైద్యసేవలు సరిగా అందడంలేదన్నారు. ఈ స్థితిలో అధికారులు వెంటనే ఉద్యోగులను నియమించాలని ఆయన కోరారు.

# పది పరీక్షలకు విద్యార్థుల అవస్థలు

- దూరభారంగా పరీక్షా కేంద్రాలు
- ఆర్టీసీ బస్సులో జీనబాడు విద్యార్థినుల తరలింపు
- పినకోట విద్యార్థులకు శివలింగపురంలో వసతి
- ఈ ఏడాదైనా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేనా..?



గత ఏడాది పరీక్షలకు జీనబాడు నుంచి ఆర్టీసీ బస్సులో వెళ్తున్న విద్యార్థినులు(ఫైల్)

అనంతగిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విస్తీర్ణం ఎరంగా అనంతగిరి మండలం పెద్దది కావడంతో మారుమూల ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు పదో తరగతి పరీక్షల సమయంలో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం ఆనుకుని అనంతగిరి మండలానికి చెందిన జీనబాడు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికలకు, పినకోటలోని గిరిజన సంక్షేమ బాలురు పాఠశాలలున్నాయి. ఏటా ఈ పాఠశాలల్లోని పదో తరగతి పిల్లల తరలింపులో సిబ్బందికి పెద్ద సమస్యగానే మారింది. సు మారు 80 కిలో మీటర్ల దూరం ప్రయాణించి పరీక్ష కేంద్రాలకు హాజరుకావాల్సి వస్తోంది. మండలంలో నాలుగు పరీక్షలు కేంద్రాలు ఉన్నాయి. అనంతగిరి బాలికల-1, కొత్తవలస బాలుర పాఠశాలలో కేంద్రాల్లో బొర్రా, టోకూరు, పెదబిడ్డ, లంగుపర్తి, బాలికల- 1, 2, కొత్తవలస పాఠశాలల్లోని విద్యార్థులు పరీక్షలు రాస్తుంటారు. వీరికి పరీక్ష కేంద్రాల సమీపంలోని వసతిగృహాల్లో వసతి సౌకర్యం కల్పిస్తున్నారు.

శివలింగపురం, కొత్తూరు కేజీబీవీ ఈ రెండు పరీక్ష కేంద్రాల్లో గుమ్మకోట, కేజీబీవీ, చిలకలగెడ్డ, భీంపోల్, శివలింగపురం, జీనబాడు, పినకోట విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. అయితే, పినకోట నుంచి గత ఏడాది 35 మంది పదో తరగతి విద్యార్థులను శివలింగపురంలోని ఆశ్రమ పాఠశాలలో వసతి కల్పించి పరీక్షలు రాయించారు. జీనబాడు విద్యార్థులను కొత్తూరు కేజీబీవీలో ఉంచి పరీక్షలు రాయించేవారు. అయితే గత ఏడాది నుంచి వసతి సమస్యగా మారడంతో జీనబాడు నుంచి విద్యార్థినులు పరీక్షలురాసేందుకు రోజూవెళ్లాల్సి వచ్చింది. తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు.. గత ఏడాది 60 మంది విద్యార్థినుల కోసం సింహాచలం డిపో పరిధి నుంచి ఆర్టీసీ బస్సును ఏర్పాటుకు విజయనగరం జోన్ ఆర్టీసీ ఛైర్మన్ సియ్యారి దొన్నుదొర ప్రత్యేక చొరవ చూపారు. విద్యార్థుల నుంచి మినీమం ఛార్జీలతో బస్సును నడిపారు. జీనబాడు నుంచి 70 నుంచి 80 కిలో మీటర్లు ప్రయాణించి, కొత్తూరు, శివలింగపురం పరీక్ష కేంద్రాలకు చేరుకోవడానికి చిన్నారులు వ్యయ ప్రయాసలకు లోనయ్యారు. జీనబాడు పాఠశాల నుంచి 43 మంది, పినకోట ఆశ్రమ బాలురు పాఠశాల నుంచి 28 మంది విద్యార్థులకు ప్రత్యామ్నాయంగా పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలి. లేకుంటే పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు 70 నుంచి 80 కిలో మీటర్లు ప్రయాణం చేయాల్సి ఉం టుందని, దీనిపై అధికారులు పునరాలోచించి మేలు చేయాలని టీడీపీ జీ నబాడుగ్రామ కమిటీ అధ్యక్షుడు సురేశ్, స్థానికులతో కలిసి పాడేరు స్పందనలో వినతిపత్రాన్ని అందజేశారు. అధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి.

## రూ. 90 లక్షలతో ముసరలంక వంతెన నిర్మాణం



శంకుస్థాపన చేస్తున్న టీడీపీ అధికార ప్రతినిధి చిన గెన్ను, తదితరులు

డుంబ్రిగుడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటగన్నెల, రంగిలిసింగి పంచాయతీలకు అనుసంధానమైన ప్రధాన రహదారిలో ముసరలంక వంతెనకు ప్రభుత్వం రూ. 90 లక్షలు మంజూరు చేసిందని అరకు టీడీపీ అధికార ప్రతినిధి చిన గెన్ను, పార్టీ మండల అధ్యక్షులు ఆనందరావు తెలిపారు. ఈనేపథ్యంలో గురువారం ఈ వంతెన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో గిరిజన గ్రామాల అభివృద్ధి వైపు పయనిస్తున్నాయన్నారు. ఈ వంతెన పూర్తయితే, గిరిజనులకు కష్టాలు తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## చోరీ, దాడి కేసులో నిందితుడికి జైలు, జరిమానా

హుకుంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిపై దాడి చేసి బంగారం దొంగలించేందుకుయత్నించిన కాకరి రాంబాబుకు జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించినట్టు స్థానిక సీఐ సన్యాసి నాయుడు తెలిపారు. గురువారం ఈ కేసుకు సంబంధించి ఆయన అందించిన వివరాలివి.. మండలంలోని శోభకోటకు చెందిన వృద్ధురాలు లకే రవణమ్మ తన మనవరాలిని తీసుకు రావడానికి వెళ్తుండగా, మధ్యంలోని అదే గ్రామానికి చెందిన కాకరి రాంబాబు రమణమ్మ ముక్కులో బంగారు వస్తువులు తీసుకునేందుకు ప్రయత్నించాడు. తప్పించుకునే ప్రయత్నించిన వృద్ధురాలిపై రాంబాబు కోపంతో దాడి చేసి బంగారంతో అక్కడి నుంచి పారిపోయాడు. గాయపడిన రమణమ్మను కుటుంబ సభ్యులు పాడేరు ఆస్పత్రికి తరలించి చికిత్సనందించారు. స్థానిక పోలీసులకు 3-12-2024 తేదీన రాంబాబుపై కేసు నమోదు చేశారు. ఈ నెల 19వతేదీన జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ముద్దాయి రాంబాబుకు రెండేళ్ల జైలు, రూ. 2వేలు జరిమానా విధించినట్టు సీఐ సన్యాసినాయుడు తెలిపారు నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సూర్యనారయణ, సిబ్బంది తదితరులు ఉన్నారు

## పాఠశాలలో సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం వద్దు



జెన్‌కో ఎస్ఈకి వినతిపత్రం ఇస్తున్న పాఠశాల సిబ్బంది

సీలేరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు గురుకుల పాఠశాలలో మెగా కంపెనీయాజమాన్యం నిర్మిస్తున్న మరుగుదొడ్ల సెప్టిక్ ట్యాంక్‌ను వేరేచోట ఏర్పాటు చేయాలని కోరుతూ, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బుచ్చిబాబు, ఉపాధ్యాయ సిబ్బంది స్థానిక జెన్‌కో ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డికి గురువారం వినతి పత్రంను అందజేశారు. గురుకుల పాఠశాల ఉన్న ప్రాంతమంతా ఏపీ జెన్‌కో చెందినది. ప్రస్తుతం సీలేరులో కొత్తగా మంజూరు చేసిన 1350 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు పనులను దక్కించుకున్న మెగా కంపెనీకి అవసరమైన కార్యాలయాలు, ఇంజనీర్లు, సిబ్బంది నివాసానికి గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న కొంత ప్రదేశాన్ని జెన్‌కో అధికారులు కేటాయించారు. ఈ నేపథ్యంలో ఇళ్లతోపాటు సెప్టిక్ ట్యాంక్‌ను నిర్మిస్తున్నారు. ఈ సెప్టిక్‌ట్యాంక్ పాఠశాలలోని వినాయక ఆలయానికి సమీపంలో, విద్యార్థుల తాగునీటి బోరుకి చేరువలో ఉందన్నారు. తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ స్థితిలో సెప్టిక్ ట్యాంక్‌ను దూరంగా మరొక ప్రదేశంలో నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## 29న మండల సర్వసభ్య సమావేశం

కొయ్యూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 29న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో జీడీవీ ప్రసాదరావు తెలిపారు. ఎంపీపీ బడుగు రమేశ్‌బాబు అధ్యక్షత ఉదయం 11 గంటలకు సమావేశ నిర్వహణ జరుగుతుందన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు ఎంపీటీసీలు విధిగా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

# 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీల ఖాతాల్లో జమ చేయాలి



నిధులు మంజూరు చేయాలని కోరుతున్న సర్పంచులు

ముంచంగిపుట్టు, నవంబరు 20 ( ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల ఖాతాలో వెంటనే జమ చేయాలని ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం మండల ఉపాధ్యక్షుడు కొర్రా త్రినాథ్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో పలు పంచాయతీల సర్పంచ్‌లు, ఉప సర్పంచులతో ఆయన సమావేశమయ్యారు. గ్రామాల్లో సమస్యలు, ఉన్న నిధులు ఇతర అంశాలపై చర్చించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రెండు విడతలుగా 15వ ఆర్థిక సంఘం నిధుల రూ.958 కోట్లు విడుదల చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధులు పంచాయతీలకు జమ చేసి, గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీలు, సీసీ రోడ్లు, పారిశుధ్యం, వీధి దీపాలు తదితర అభివృద్ధి పనులు జరిగే విధంగా చూడాలని ఆయన కోరారు. గత ప్రభుత్వం ఇదే విధంగా నిధులు మళ్లించడంతో పంచాయతీల అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు ఎస్.సుభాష్, ఎస్.నరసింగరావు, కె.శివశంకర్, డి.నీలకంఠం, నోబిన తదితరులు పాల్గొన్నారు.

## రహదారి పనుల పరిశీలన



గాలికొండ మద్దిల బూసుకొండ రోడ్డు పనులను పరిశీలిస్తున్న డీఈ జ్యోతిబాబు

సీలేరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలంలోని మారుమూల ప్రాంతమైన గాలికొండ పంచాయతీ పరిధిలోని గాలికొండ మద్దిలబూసుకొండ రహదారి పనులను పంచాయతీరాజ్ డీఈ జ్యోతిబాబు గురువారం పరిశీలించారు. గాలికొండ నుంచి మద్దిల బూసుకొండ వరకు నాలుగు కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి గిరిజన సంక్షేమ శాఖ నిధులు నుంచి రూ. 4 కోట్లు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో నిర్మాణ పనులను డీఈ పరిశీలించారు.

## గంజాయి నిర్మూలన అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఎస్ఐ కొల్లి రమణ

పెదబయలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహమ్మారి గంజాయిని నిర్మూలించే బాధ్యత అందరిపై ఉందని స్థానిక ఎస్ఐ కొల్లి రమణ అన్నారు. గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో జె. స్రవంతి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తల అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గంజాయిని సాగు, భద్రపరిచినా, రవాణా చేసినా, విక్రయించినా, కొనుగోలు చేసినా చట్టరీత్యా నేరమని తెలిపారు. అలాగే, బాల్యవివాహాలు నిరోధించాలన్నారు. ఈ మేరకు గ్రామాల్లో నిరాక్షరాసులు, బాలికలను చైతన్య పరచాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పైడిమంగమ్మ, సింహాచలం, కె. సింహాచలం పాల్గొన్నారు.

# ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న లైబ్రేరియన్, తదితరులు

పాడేరురూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పాడేరు శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా ముగింపు కార్యక్రమం చేపట్టారు. ముందుగా గ్రంథాలయ పితామహుడు రంగనాథన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. వారం రోజులుగా నిర్వహించిన క్విజ్, డ్రాయింగ్, మ్యూజికల్‌చైర్, సాంగ్స్, ముగ్గులు తదితర పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. వారోత్సవాలకు సహకరించిన ఉపాధ్యాయులను లైబ్రేరియన్ వి.మానస, పాఠకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.విశ్వప్రసాద్, నానాజీ, ఉపాధ్యాయులు కరణం సూర్యకుమారి, శెట్టి కన్నయ్య, ఎ.రాధాకృష్ణ, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీకళాశాల్లో ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టబ్బాయి ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించి, అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందించారు.ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ టీ ఎస్ రసూల్, అధ్యాపకులు పి.కోటేశ్వరరావు, జానకీరామ్, వి.రమేశ్‌బాబు, జి.గౌరీశంకరరావు, గణేష్, దామోదరం, అప్పలనాయుడు, పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

**డుంబ్రిగుడ:** గ్రంథాలయాలతో ఉన్నత భవిష్యత్తుకు పునాదులు ఏర్పరచుకోవచ్చని స్థానిక ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు కార్యక్రమంలైబ్రేరియన్ సునీత ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో పాల్గొని వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రభుదాస్, అధ్యాపకులు దివాకర్, ఉపాధ్యాయుడు సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

## రబీలో సాగుకు ప్రణాళిక : జిల్లా వ్యవసాయ అధికారి



రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేసిన డీఏవో నందు

చింతపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో రబీ పంట కాలంలో అపరాలు, వేరుశనగ సాగుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌బీఎస్ నందు తెలిపారు. గురువారం మండలంలో పర్యటించిన ఆయన చిన్నగెడ్డలో గిరిజన రైతుల సాగు చేస్తున్న వరి, రాజ్‌మా, వలిసెలు, రాజ్‌మా పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రబీలో ఆదివాసీ రైతులు పంట పొలాలను ఖాళీగా విడిచిపెడుతున్నారన్నారు. దీంతో అతి తక్కువ మంది రబీలో రెండో పంటను సాగు చేస్తున్నారన్నారు. రబీలో పొలాలు ఖాళీగా విడిచిపెట్టకుండా ఆరుతడి పంటల సాగును ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రధానంగా మినుములు, పెసలు, వేరుశనగ సాగు చేసేందుకు రైతులకు 90శాతం రాయితీపై విత్తనాలను పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా అధిక విస్తీర్ణంలో అపరాలు, వేరుశనగ సాగుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఏడీఏ బి. ప్రభాకరరావు, వ్యవసాయ అధికారి మధుసూదనరావు, కూటమి నాయకులు రీమల ఆనందరావు, మం గ్లు, వల్లి, ఏఎంసీ డైరెక్టర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## జంగంపుట్టులో ఉపాధ్యాయుడ్ని నియమించాలి



పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు, జీవీఎస్‌యూ నాయకులు

పెదబయలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుల్లేలు పంచాయతీ పరిధిలో జంగంపుట్టు ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయుడు లేక 40 మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని గ్రామస్థులు, జీవీఎస్‌యూ నాయకులు ఆవేదన వ్యక్తంచేశారు. ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయురాలు సుమారు 20 రోజులుగా సెలవులో ఉన్నారన్నారు. మండల విద్యాశాఖ అధికారులు మరొక ఉపాధ్యాయుడిని నియమించకపోవడంతో చిన్నారులు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పాఠశాల భవనం లేక అవస్థలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి పాఠశాలలో ఉపాధ్యాయుని నియమించి, పాఠశాల భవన నిర్మాణానికి చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాధవరావు, చంటిబాబు, లింగమూర్తి, నాగార్జున్, శివాజీ పాల్గొన్నారు.

**ఉపాధ్యాయుడిని నియమించాం: ఎంఈవో**

ఎంఈవో-1 కృష్ణమూర్తి వద్ద ఈ విషయం ప్రస్తావించగా, జంగంపుట్టు పాఠశాలలో ఉపాధ్యాయురాలు సెలవులు పెట్టారని, అనంతరం భాషా వాలంటీరును నియమించామన్నారు. వలంటీర్ కూడా అనారోగ్యంతో ఉండడంతో మరొక ఉపాధ్యాయుడిని నియమించామన్నారు. శుక్రవారం నుంచి పాఠశాలకు ఆయన వెళ్తారన్నారు.

## ఘనంగా కార్తీక దీపార్చన



ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో దీపాలువెలిగిస్తున్న మహిళలు

పాడేరురూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాడేరులోని పురాతన శైవ క్షేత్రం ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రాత్రి కార్తీక దీపార్చన కార్యక్రమాన్ని మహిళలు భక్తి శ్రద్ధలతో చేపట్టారు. ఆలయ ఆధ్యాత్మిక ధర్మమండలి ధర్మకర్త కొట్టగుళ్లి రమాదేవి పర్యవేక్షణలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయ ప్రాంగణంలో కార్తీక మాస లక్ష దీపార్చన కార్యక్రమాన్ని చేపట్టారు. మహిళలకు ఆలయ కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి రామారావు, కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఉప్పల వెంకటరత్నం, సిద్దినాతి కొండలరావు, శివరాత్రి శ్రీనివాస్ కుమార్ ప్రసాదం, అల్పాహారం ఏర్పాటు చేశారు.

## వీఆర్‌ఏల నిరసన




తహసీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న రెవెన్యూ సహాయకులు

పెదబయలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకులు తమ సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేశారు. గురువారం ఈమేరకు వినతిపత్రాన్ని స్థానిక తహసీల్దార్ త్రినాథరావునాయుడికి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో సుదీర్ఘ కాలంగా చాలిచాలని వేతనాలతో వెట్టి చాకిరి చేస్తున్నామన్నారు. ప్రభుత్వం తమను పట్టించుకోవటం లేదని వాపోయారు. తమక తక్షణమే పే స్కేలు అమలు చేసి జీతాలు అం దించాలన్నారు. అర్హత ఉన్న వీఆర్ఏలకు వీఆర్వోగా, రికార్డు అసిస్టెంట్లుగా ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. నామినీలుగా పని చేస్తున్న వారిని వీఆర్‌ఏలుగా నియమించాలన్నారు. అటెండర్, నైట్ వాచమేన్ ప్రమోషన్ కోటాను 20 శాతం నుండి 70 శాతం వరకు పెంచాలన్నారు. అక్రమ డ్యూటీలను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏలు సుందర్‌దేవా, నీలకఠం, కోటి, సతీశ్, నాగన్న, శేషగిరి, గోవింద్, పార్వతమ్మ, సన్యాసమ్మ పాల్గొన్నారు.

**హుకుంపేట:** గ్రామ సేవకులు గురువారం స్థానిక రెవెన్యూ ఆందోళన చేపట్టారు. తహశీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి. కృష్ణారావు మాట్లాడుతూ వేతనాలను పెంచి ప్రతి నెలా సక్రమంగా చెల్లించాలన్నారు. ఇతర విధులను తమకు అప్పగించరాదని తెలిపారు ఈ కార్యక్రమంలో గిరిన సంఘం మండల అధ్యక్షులు లక్ష్మణరావు, విఆర్ఏలు కె. స్వరూప, ధనలక్ష్మి, సంపత్, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య పరిరక్షణతో ప్రజారోగ్యం మెరుగు



సమావేశంలో పాల్గొన్న ఎంపీడీవో, డ్వాక్రా మహిళలు

కొయ్యూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో పారిశుధ్యం పరిరక్షణతో ప్రజారోగ్యం సాధ్యమని ఎపీడీవో జీడీవీ ప్రసాదరావు పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిరభివృద్ధి లక్ష్యాల సాధనపై డ్వాక్రా మహిళలు, వీవోఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్తలు వేరు చేసి క్లాప్‌మిత్రలకు అందచేసేలా గ్రామాలలో డ్వాక్రా మహిళలు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమం శిక్షకులు బాబూరావు,కేటీ నాయుడు పలు అంశాలను వివరించారు.

## భవన నిర్మాణ కార్మికులకు గాయాలు

చింతపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంబసింగి గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణ పనులు చేపడుతున్న ఇద్దరు కార్మికులు ప్రమాదవశాత్తు పరంజి నుంచి జారిపడడంతో గాయపడ్డారు. గురువారం యాంపీ థియేటర్ స్లాబ్ వేసేందుకు కార్మికులు పరంజీ నిర్మిస్తుండగా గంతకూరి వీరబాబు, ఈగల బాబూరావు పైనుంచి కిందకు పడిపోయారు. గాయపడిన వీరిని అంబులెన్సులో స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకురాగా, వైద్యాధికారిఅనుష ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## సమస్యలు పరిష్కరించాలని వీఆర్ఏల ధర్నా



తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

గొలుగొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీఆర్ఏలు గురువారం ఇక్కడి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న వీఆర్ఏలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం చూపడం తగదన్నారు. వీరికి కనీస వేతనాలు అమలు చేయాలని, సీనియార్టీ ఉన్న వారికి వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ చైనులుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏల సంఘ మండల కార్యదర్శి లక్ష్మణ్, జ్యోతి, నూకరాజు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల నుంచి అందే అర్జీలపై ప్రత్యేక దృష్టి : తహశీల్దార్

మాకవరపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని తహశీల్దార్ బి.వెంకటమణ సూచించారు. గురువారం ఇక్కడ వీఆర్వోలతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ప్రజల నుంచి అందే అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపరాదన్నారు. ముఖ్యంగా పెండింగ్ అనే పదం వినిపించ రాదని స్పష్టం చేశారు. మ్యూటేషన్‌కు సంబంధించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ భూముల వివరాలను తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ నూకరాజు, ఆర్ఐ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు


ప్రకృతి వ్యవసాయంపై రైతులకు సూచనలిస్తున్న ప్రాజెక్టు మేనేజర్ లచ్చన్న

మాకవరపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని, ఈ విధానంపై రైతులు ఆసక్తి చూపాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సి హెచ్.లచ్చన్న సూచించారు. మండలంలోని కొండల అగ్రహారంలో ప్రకృతి వ్యవసాయంపై గురువారం రైతులకు ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. రబీ సీజన్‌కు ముందుగా వేసుకోవలసిన ప్రధాన ఐదు పంటలైన పెసర, మినుములతో పాటు కందులు, జొన్నలు, గోరుచిక్కుడు వంటి వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఈ పంటల సాగు వల్ల భూమిలో సూక్ష్మజీవులు వృద్ధి చెంది, భూమి సారవంతం అవుతుందన్నారు. అలాగే ఏడాది పొడవునా పంట పొలాలు పచ్చగా ఉండేలా సాగు విధానాలపై అవగాహ కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పోలిరెడ్డి రమణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## 24న నాతవరంలో రక్తదాన శిబిరం

నాతవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 24వ తేదీ సోమవారం మండల కేంద్రం నాతవరంలో కేఎస్ఆర్ టిమ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ తెలిపారు. వివిధ గ్రామాల యువకులు తరలి వచ్చి రక్తదానం చేయాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు.

# కీలక రోడ్డు నిర్మాణంలో కదలిక

» స్పీకర్ అయ్యన్న చొరవతో చకచకా నర్సీపట్నం- పెదబొడ్డేపల్లి రహదారి పనులు » వాహనదారుల్లో ఆనందం


పెదబొడ్డేపల్లి డాన్ బాస్కో కళాశాల వెనక చర్చి ప్రాంతంలో బీటీ రోడ్డు కోసం మెటల్ వేసిన దృశ్యం

నర్సీపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చొరవ ఫలితంగా కీలకమైన రహదారి పనులకు మార్గం సుగమం అయింది. ఇందులో భాగంగా నర్సీపట్నం- పెద బొడ్డేపల్లి రోడ్డు నిర్మాణ పనులలో ఎట్ట కేలకు కదలిక ఏర్పడింది. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే నర్సీపట్నంలో ట్రాఫిక్ ఇబ్బందులు చాలా వరకు తొలగుతాయి. చింతపల్లి రోడ్డు నుంచి పెదబొడ్డేపల్లి వెళ్లే ఆటోలు, వ్యాన్‌లు, ద్వి చక్రవాహలు పట్టణంలోకి వచ్చే అవసరం లేకుండా సరస్వతీ జంక్షన్ నుంచి వెంకటేశ్వరస్వామి గుడి మీదుగా పెదబొడ్డేపల్లి చేరుకోవచ్చు. గత వైసీపీ ప్రభుత్వంలో 2.5 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణం, డ్రైనేజీ పనులకు రూ.6.5 కోట్లు మంజూరు చేశారు. సుమారు రూ.1.5 కోట్లు ఖర్చు పెట్టి ఒక కిలోమీటరు రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. కాంట్రాక్టర్‌కి బిల్లులు మంజూరు జాప్యం కారణంగా ఎక్కడ పనులు అక్కడ నిలిచి పోయాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మాణ పనులు మళ్లీ మొదలయ్యాయి. డాన్ బాస్కో కళాశాల వెనక చర్చి ఎదురుగా అసంపూర్తిగా ఉన్న బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.32 లక్షలు, శ్మశాన వాటిక నుంచి ఆర్అండ్‌బీ అతిథి గృహం వెనుక భాగం వరకు డ్రైనేజీ కాలువ నిర్మాణానికి రూ.44.87 లక్షలు, శ్మశాన వాటిక నుంచి కొత్తవీధి వరకు రూ.53.25 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. ప్రస్తుతం చర్చి ప్రాంతంలో బీటీ రోడ్డు వేయడానికి మెటల్ వేసి సిద్ధం చేశారు. పది హేను రోజుల్లో ఈ పనులు పూర్తి అవుతాయని డీఈఈ కామేశ్వర రావు తెలిపారు. డ్రైనేజీ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. ఈ రోడ్డు పనులు పూర్తి చేస్తే పెదబొడ్డేపల్లి వెళ్లడం చాలా సులభతరం అవుతుందని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


కొత్తవీధి శ్మశాన వాటిక సమీపంలో సీసీ డ్రైనేజీ పనులు

## డోలు వాయిద్య కళాకారుడికి ఆకాశవాణిలో అవకాశం

నర్సీపట్నం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : శాస్త్రీయ వాయిద్య కళాకారులకు విశాఖపట్నం ఆలిండియా రేడియో నిర్వహించిన సంగీత ప్రదర్శనలో నర్సీపట్నం ప్రాంతానికి చెందిన డోలువాయిద్య కళాకారుడు నవరపు నాగ కొండరావు బి-గ్రేడ్ సాధించారు. గత ఏడాది డిసెంబరులో విశాఖలో జరిగిన కర్ణాటక శాస్త్రీయ సంగీతం వాయిద్య కళాకారుల ఆడిషన్స్‌కి వివిధ జిల్లాల నుంచి వీణ, వయోలిన్, తవిల్, తంబుర, వేణువు, ఘటం, కంజీర, మోర్సింగ్, నాదస్వరం, గొట్టు వాద్యం కళాకారులు హాజరయ్యారు. ఈ ప్రదర్శనలో డోలు (తవిల్) వాయిద్య కళాకారులు 30 మంది పాల్గొనగా వారిలో నాగ కొండలరావు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆలిండియా రేడియో ప్రొగ్రామ్ ఎగ్జిక్యూటివ్ ఎన్. ఇందిరా చేతుల మీదుగా ఉత్తీర్ణత పత్రాన్ని తీసుకున్నారు. ఇక నుంచి అక్కడ నిర్వహించే కచేరీలలో డోలు వాయిద్య కళాకారుడుగా ఆయన పాల్గొంటారు.



ఉత్తీర్ణత పత్రం అందజేస్తున్న ప్రొగ్రామ్ ఆఫీసర్

## ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

నర్సీపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎంఈవో తలుపులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారోత్సవాలు సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థు లకు గ్రంథాలయ అధికారిణి దమయంతి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల అధ్యాపకుడు శర్మ, విశ్రాంత గ్రంథాలయ అధికారి త్రిమూర్తులురెడ్డి, పెదబొడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రవికుమార్, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు పొందిన వారితో అతిథులు

## గంజాయి నిర్మూలనకు విస్తృత తనిఖీలు

» గ్రామాల్లో డ్రోన్‌లు ఎగురవేస్తున్నట్టు సీఐ రేవతమ్మ వెల్లడి

కృష్ణాదేవిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గంజాయి, సారా వంటి వాటిని అరికట్టేందుకు డ్రోన్ కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘాతో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నట్టు నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ తెలిపారు. ఏజెన్సీ ముఖద్వారమైన భీమవరం పోలీస్ చెక్‌పోస్టు వద్ద గురువారం ఆమె తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లావూరు, పాత కృష్ణాదేవిపేట, బంగారంపేట- అంతాడ రహదారి తదితర ప్రాంతాలపై డ్రోన్ కెమెరాను ఎగురవేశారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలపై గుట్టు రట్టు చేసేందుకు ప్రయత్నించారు. అలాగే అనుమానితులను ప్రశ్నించి వారి బ్యాగులను పరిశీలించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రూరల్ సర్కిల్ స్టేషన్ పరిధిలో గ్రామాల్లో గంజాయి, సారా, అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. కృష్ణాదేవిపేట ఇన్‌చార్జ్ ఎస్ఐ రామారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


భీమవరం చెక్‌పోస్టు వద్ద సీఐ వాహన తనిఖీలు

## 'నూతన చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి'

గొలుగొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నూతన చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ విద్యార్థులకు సూచించారు. ఇక్కడి కేజీబీవీ పాఠశాల, వొకేషనల్ కళాశాలలో విద్యార్థులకు నూతన చట్టాలపై గురువారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, పోక్సో కేసుల వలన శిక్షణలను వివరించారు. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని ఆమె ఆకాంక్షించారు. ఎస్ఐ రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అక్షరాస్యులుగా తీర్చిదిద్దే బాధ్యత వలంటీర్లదే


మాట్లాడుతున్న ఎంపీడీవో ఆంజనేయులు

చోడవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రామహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే బృహత్తర బాధ్యత వలంటీర్లపైనే ఉందని స్థానిక ఎంపీడీవోపీఎస్‌జేఎన్ అంజనేయులు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు ఆధ్వర్యంలో ఉల్లాస్ పథకం కింద ఎంపికైన వలంటీర్లకు శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, కనీస విద్యా పరిజ్ఞానం లేని మహిళలకు చదవడం, రాయడం నేర్పించాలని కోరారు. అక్షరాస్యతతోపాటు, ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యతపై పరిజ్ఞానం కల్పించాలని కోరారు. డబ్బులు డిపాజిట్, తీయడం, చెక్కులు వినియోగం, సెల్‌ఫోన్‌లో యూపీఐ లావాదేవీలపై పరిజ్ఞానాన్ని పెంపొందించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ గాడి కాసు, వెలుగు ఏపీఎం తిలక్, మండలంలోని 180 వలంటీర్లు పాల్గొన్నారు. మహిళలకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఒక్కో వలంటీర్‌కు పదిమంది చొప్పున బాధ్యతలు కేటాయించినట్టు ఏపీఎం తెలిపారు.

### చట్టాలపై అవగాహన


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసరావు

బుచ్చెయ్యపేట నవంబరు 20 (ఆంధ్ర జ్యోతి): మండలంలో వడ్డాది ఎన్‌టీఎస్ స్కూల్‌లో చట్టాలపై ఎస్ఐ శ్రీనివాసరావు గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత తదితర వాటిని వివరించారు. అలాగే మత్తు పదార్థాలతో అనర్థాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎన్‌టీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఇళ్ల పన్ను ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి


డిప్యూటీ ఎంపీడీవో లవరాజు

బుచ్చెయ్యపేట నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇళ్ల పన్నులనుపంచాయతీ కమిషనర్ ఆదేశాల మేరకు ఆన్‌లైన్‌లో చెల్లించాలి డిప్యూటీ ఎంపీడీవో లవరాజు తెలిపారు. అలా, పంచాయతీ కార్యదర్శులు నేరుగా మీ వద్ద నగదు వసూళ్లకు పాల్పడితే తనకు తెలపాలన్నారు. ఆన్‌లైన్‌లో చెల్లించి పంచాయతీలకు సహకరించాలని కోరారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాడుగుల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాడుగుల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9గంటల నుంచి పది గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని నర్సీపట్నం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎస్ఎం అప్పారావు గురువారం తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

**దేవరాపల్లిలో...**

దేవరాపల్లి: దేవరాపల్లి సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరానిలిపివేస్తామని ఏఈఈ క్ర్రి.శంకరరావు తెలిపారు. తెనుగుపూడి, వెంకటరాజపురం, చినగంగవరం, గర్శింగి, చీడికాడ మండలం చీడిపల్లి, మారేపల్లి, పెదనందిపల్లి, వాకపల్లి, తిమిరాం, కలిగొట్ల గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

**చీడికాడ:** మండలంలో శుక్రవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈఈ నమ్మి వెంకటరావు తెలిపారు. తురువోలు, కోనాం, ఖండివరం, అప్పలరాజుపురం ఫీడర్‌ల పరిధిలోని 14గ్రామాల్లో వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

# ఇలా అయితే ప్రమాదం కాదా?

» వాహనాల్లో పరిమితికి మించి చిన్నారుల తరలింపు
» నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు విద్యా సంస్థల తీరు
» పట్టించుకోని అధికార యంత్రాంగం

మాడుగుల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పరిమితికి మించి విద్యార్థులను వాహనాల్లో తరలిస్తున్నారు. దీంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన వ్యక్తమవుతోంది. మాడుగుల కేంద్రంలో మూడు ప్రైవేటు పాఠశాల పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో విద్యార్థులను వేలాది రూపాయలు ఫీజులు చెల్లించి తల్లిదండ్రులు చేర్పిస్తున్నారు. ఇళ్లనుంచి విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు బస్సులు, ఆటోలు, మ్యాక్సీ క్యాబ్‌లను కల్పిస్తున్నాయి. అయితే, వీటిలో చిన్నారులను కిక్కిరిసి మరీ ఎక్కిస్తున్నారు. ఆటోల్లో 15 మందికి పైగా తరలిస్తున్నారు. పోలీసులు, ఆర్టీఏ అధికారులు కానీ, పట్టించుకొనే పరిస్థితి లేకపోవడంపై విమర్శలు తలెత్తుతున్నాయి. విద్యా సంస్థలు వాహనాలు నడిపే డ్రైవర్లు వయసులో అనుభవం, హెవీ లైసెన్స్ కలిగిన వారు ఉండాలి. కానీ అనుభవం లేనివారికి డ్రైవర్ సీటులో కూర్చోబెట్టి విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారు. వాహనాలను లీజుకి తీసుకుని విద్యార్థుల తల్లితండ్రుల నుంచి అధిక రవాణా చార్జీలు వసూలు చేస్తున్నారు. అయితే, దీంతో ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరనేది ప్రశ్నార్థకంగా మారింది.



ఆటోలో కిక్కిరిసి వెళ్తున్న చిన్నారులు


ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సులో విద్యార్థులు

**నిబంధనలకు విరుద్ధంగా తరగతి భవనాలు**

ఈ పాఠశాలల్లో తరగతి భవనాలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయి. ఏదైనా ప్రమాదం జరిగితే బయటకు వచ్చే వెసులుబాటు సరిగాలేదు. కనీసం క్రీడా మైదానం ఉండడంలేదు. ఇలా ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి పాఠశాలలు నడుపుతున్న అధికారుల పర్యవేక్షణ కరువైంది. అధికార యంత్రాంగం ఇకనైనా స్పందించి ప్రైవేట్ పాఠశాలల యజమానులను కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.

## ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

చోడవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన గ్రంథాలయ ఈ ముగింపు కార్యక్రమం జరిగింది. ఎంఈవోలు పాండురంగారావు, కె. సింహాచలంలు హాజరై వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎంలు, రిటైర్డ్ లెక్చరర్లు టీవీ రమణ, గౌరీశంకర్, ప్రాత రాజశేఖర్, ఉపాధ్యాయులు రామయ్యరెడ్డి, లైబ్రేరియన్ ఎం ఎస్ ఎల్ జోగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

**రావికమతం:** గ్రంథాలయాలు విజ్ఞాన దేవాలయాలని కొత్తకోట సర్పంచ్ కోన లోవరాజు అన్నారు. గంథ్రాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా కొత్తకోటలో గురువారం గ్రంథాలయంలో పాలకురాలు ఆర్.వరహామణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. స్థానిక కాలేజీ తెలుగు అధ్యాపకులు నూకరాజు, హెచ్ఎం, గ్రామ పెద్దలు పి.నానాజీ, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

**కె.కోటపాడు:** మండలంలోని చౌడువాడ శాఖా గ్రంథాలయంలో గత వారం రోజులుగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన జడ్పీ హైస్కూల్, ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎం. పద్మావతి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జి. వెంకటరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందచేస్తున్న ఎంఈవో పాండురంగారావు

**బుచ్చెయ్యపేట:** గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని స్థానిక జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, రాష్ట్ర గంథాలయ సంస్థ మెంబర్ సిరిగిరి శెట్టి శ్రీరామూర్తి తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. చిన్నారులు పుస్తక పఠనం తప్పక చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు గోపిశెట్టి శ్రీనివాసరావు, పెద్దడ నాయుడు, మాజీ సర్పంచ్ సుంకర గాంధీ, కూటమి నాయకులు దొండా గిరిబాబు, సింగంపల్లి రమేశ్, పూడి రామారావు, మేడిశెట్టి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.


కె. కోటపాడులో బహుమతులు అందుకున్న విద్యార్థులు


బుచ్చెయ్యపేటలో..

## పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ


రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణి

కె.కోటపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.కోడూరు పోలీసుస్టేషన్‌ను గురువారం అనకాపల్లి డీఎస్పీ ఎం. శ్రావణి వార్షిక తనిఖీలు చేపట్టారు. రికార్డులను పరిశీలించారు. ప్రధాన కూడలి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, గంజాయి రవాణా అరికట్టడంతో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఐ పైడపునాయుడు, ఎస్ఐ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

## బీఎన్ రోడ్డుపై కూరుకుపోయిన లారీ: ట్రాఫిక్‌కు అంతరాయం


కూరుకుపోయిన లారీ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నేతలు

రోలుగుంట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రైవేటు ఆసుపత్రి సమీపంలో బీఎన్ రోడ్డు వద్ద ఉన్న గోతిలో లోడ్ లారీ కూరుకుపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో స్థానిక సీపీఎం నాయకులు లారీ కూరుకుపోయిన ప్రాంతం వద్ద ఆందోళన నిర్వహించారు. రోడ్డు నిర్మాణంపై ఎంపీ, ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీ అమలుల్లో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రహదారిలో గోతుల వల్ల గర్భిణులు, వృద్ధులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.గోవిందరావు, చిరంజీవి, గెమ్మిలి వాసు తదితరులు పాల్గొన్నారు.

## 23న చీడికాడలో జాబ్‌మేళా

చీడికాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చీడికాడ ప్రభుత్వ హైస్కూల్‌లో ఈనెల 23న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎన్. గోవిందరావు తెలిపారు. 15 కంపెనీలు హాజరయ్యే ఈ మేళాలో 10వ తరగతి, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీవరకు చదువుకుని 18నుంచి 35సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ యువకులు పాల్గొనాలని కోరారు. తమ వివరాలను తొలుత (నైపుణ్యం డాట్ ఏపీ డాట్ జీవోవి డాట్ ఇన్) వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదుచేసుకోవాలన్నారు. అవసరమైన ధ్రువపత్రాలతో ఆ రోజు ఉదయం 10 గంటలకు హాజరుకావాలన్నారు. వివరాలకు 79811 02224ను సంప్రదించాలని ఆయన కోరారు.

# ఎన్టీఆర్ వైద్యాలయం బ్లడ్ బ్యాంకుకు నూతన పరికరాలు


వైద్యాలయానికి వచ్చిన అధునాతనమైన పరికరాలు

అనకాపల్లి టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో ఉన్న బ్లడ్ బ్యాంకుకు రూ.కోటి విలువైన నూతన పరికరాలను ప్రభుత్వం అందజేసింది. ఈ విషయాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు వైద్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వెల్లడించారు. ఇప్పుడు ఎన్టీఆర్ వైద్యాలయంలో రక్తం నుంచి ప్లాస్మా, ప్లేట్‌లెట్స్, ప్యాకెట్ రెడ్ బ్లడ్ సెల్స్ (పీఆర్‌బీసీ), క్రియో సెల్స్‌ను వేరు చేసే పరికరాలు అందుబాటులోకి వచ్చాయని ఆయన చెప్పారు. జిల్లాలో మొట్టమొదటిసారిగా రూ.కోటి విలువైన ఈ పరికరాలు ఎన్టీఆర్ వైద్యాలయానికి వచ్చాయన్నారు. ఎన్టీఆర్ వైద్యాలయం అభివృద్ధికి కృషి చేస్తున్న కలెక్టర్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ విజయకృష్ణన్, స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి డాక్టర్ రమేశ్, టెక్నీషియన్లు లోకేశ్, రమేశ్, రాజు, గీత, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.











# బీసీ హాస్టల్ విద్యార్థి అదృశ్యం

- మూడు రోజులైనా తెలియని ఆచూకీ
- సిబ్బంది వల్లే తన కుమారుడు వెళ్లిపోయాడని తల్లి ఆవేదన
- హాస్టల్ వద్దకు వచ్చి ఆచూకీ తెలపండంటూ రోదన


అదృశ్యమైన బాలుడు ఎజ్జల నరేంద్ర (ఫైల్‌ఫొటో)


కశింకోట బీసీ వసతిగృహం వద్ద విలపిస్తున్న నరేంద్ర తల్లి సత్యవతి

కశింకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కశింకోట బీసీ వసతి గృహంలో ఉంటున్న పదవ తరగతి విద్యార్థి ఈ నెల 18వ తేదీ ఉదయం అదృశ్యమ య్యాడు. ఇప్పటికి మూడు రోజులు కావస్తున్నా ఆచూకీ తెలియకపోవడంతో ఆ విద్యార్థి తల్లి గురువారం హాస్టల్ వద్దకు వచ్చి తన కుమారుడి ఆచూకీ తెలపండని విలపించింది. సిబ్బంది ఇబ్బందులకు గురి చేయడం వల్లే తన కొడుకు అదృశ్యమయ్యాడని ఆరోపించింది. దీనికి సంబంధించి విద్యార్థి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి. అచ్యుతాపురం మండలం తంతడి పంచాయతీ వాడపాలెం గ్రామానికి చెందిన ఎజ్జల సోమునాయుడు, సత్యవతిలకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరిలో ద్వితీయ కుమారుడు ఎజ్జల నరేంద్ర కశింకోటలోని డీపీఎన్ హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతూ బీసీ హాస్టల్‌లో వసతి పొందుతున్నాడు. రోజూ మాదిరిగానే ఈ నెల 17న సోమవారం సాయంత్రం స్కూల్ నుంచి వచ్చిన తరువాత హాస్టల్‌లో ఉన్న అశోక్‌కు చెందిన ట్యాబ్‌లో నరేంద్ర, గురుదాస్‌లు గేమ్స్ ఆడుతుండగా దీనిని గమనించిన హాస్టల్ తాత్కాలిక సిబ్బంది మందలించడమే కాకుండా కొట్టడంతో భయభ్రాంతులకు గురయ్యారు. ఈ నేపథ్యంలో మరుసటి రోజు ఉదయం 6 గంటల సమయంలో ఆ విద్యార్థి అదృశ్యమయ్యాడు. అయితే ఇంటికి వెళ్లిపోయాడని ఆ బాలుడు తండ్రి సోమునాయుడుకు సిబ్బంది ఫోన్ చేసి చెప్పారు. స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో తల్లిదండ్రులు 19న సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం పోలీసులు హాస్టల్‌లో ఉన్న విద్యార్థులను విచారించారు. ఈ విషయం తెలుసుకున్న బీసీ అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ సుజాత, జిల్లా అధికారి శ్రీదేవి హాస్టల్‌ను సందర్శించి బాలుడి ఆచూకీపై తోటి విద్యార్థులను ఆరా తీశారు. సీఐ అల్లు స్వామినాయుడు, ఎస్‌ఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో బాలుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. దీనిపై హాస్టల్ ఇన్‌చార్జి వార్డెన్ నారాయణరావు వివరణ కోరగా ప్రస్తుతం చోడవరం, గోవాడ, కశింకోట హాస్టళ్లకు తాను ఇన్‌చార్జి వార్డెన్‌గా పని చేస్తున్నానని, పూర్తి స్థాయిలో ఒకే చోట విధులు నిర్వహించలేక వారంలో మూడు రోజులకోసారి ఒక్కొక్క హాస్టల్‌ను పర్యవేక్షణ చేస్తున్నానని చెప్పారు. నరేంద్ర ట్యాబ్‌లో ఆడుకుంటున్నాడని సిబ్బంది మందలించడంతో వెళ్లిపోయినట్టు తెలిసిందన్నారు.


వసతిగృహంలో పోలీసులతో మాట్లాడుతున్న బీసీ హాస్టల్స్ జిల్లా అధికారిణి శ్రీదేవి

# విద్యారంగ సమస్యలపై మంత్రి చర్చించాలి

- యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న కేఎస్ఎస్ ప్రసాద్

అనకాపల్లి టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యారంగం సమస్యలపై ఉపాధ్యాయ సంఘాలతో మంత్రి చర్చించాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ కోరారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన యూటీఎఫ్ జిల్లా కార్యదర్శివర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ జోక్యం చేసుకొని ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలని డిమాండ్ చేశారు. సర్వీసులో ఉన్న టీచర్లు అందరూ తప్పనిసరిగా టెట్ పాస్ అవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెవ్యూ పిటిషన్ వేయాలని కోరారు. 2010కు ముందు ఉపాధ్యాయ అర్హత పరీక్ష లేదని, అలాంటప్పుడు 2010వ సంవత్సరానికి ముందు ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించిన వారు కూడా టెట్ పాసు అవ్వాలని నిబంధన నుంచి వారిని మినహాయించే విధంగా ప్రభుత్వం ఆలస్యం చేయకుండా సుప్రీంకోర్టులో రెవ్యూ పిటిషన్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్రం విడుదల చేసిన మెమో 57 ప్రకారం 2004కు ముందు విడుదలైన నోటిఫికేషన్ల ద్వారా ఉద్యోగంలో జాయిన్ అయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం సుముఖంగా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం పాత పింఛన్ విధానాన్ని అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. బోధనేతర పనుల భారం ఉపాధ్యాయులపై అంతకంతకీ పెరుగుతుందన్నారు. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని కోరారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో పనిచేస్తున్న ఏకోపాధ్యాయులు ఐచ్ఛిక సెలవుల (ఓహెచ్)ను వాడుకునే వెసులుబాటు కల్పించాలన్నారు. మెగా డీఎస్సీ ద్వారా ఎంపికై ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులకు ఇప్పటికీ జీతాలు అందకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలు చెల్లించడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజి శ్రీనివాసరావు, రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వి.శ్రీలక్ష్మి, గొంది చినబ్బాయి, జిల్లా గౌరవాధ్యక్షులు పంపనబోయిన వెంకటరావు, సహా అధ్యక్షులు రొంగలి అక్కునాయుడు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# లైంగిక వేధింపులపై విచారణ

- ఈఎన్‌టీ ఆస్పత్రికి వెళ్లిన ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ
- అధికారి వ్యవహారంపై డీఎంఈకు అందిన ఫిర్యాదులు
- రెండు రోజుల్లో నివేదిక ఇచ్చే అవకాశం

విశాఖపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్నతాధికారి ఒకరు మహిళా పీజీలను, సిబ్బందిని వేధిస్తున్నారని ఇటీవల 'ఆంధ్రజ్యోతి' వరుసగా ప్రచురించిన కథనాలపై ప్రభుత్వం స్పందించింది. ఆ వైద్యాధికారిపై మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ)కు కూడా ఫిర్యాదు అందడంతో కమిటీతో విచారణ చేయించి, నివేదిక ఇవ్వాలని ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. ఆ మేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి ఐదుగురు వైద్యాధికారులతో కమిటీని నియమించారు. అందులో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, పరిపాలనాధికారి పీవీ రమణ, జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ సత్యప్రసాద్, జనరల్ సర్జరీ హెచ్‌ఓడీ, మైక్రోబయాలజీ హెచ్‌ఓడీ ఉన్నారు. వారంతా పెదవాల్తేరులోని ఈఎన్‌టీ ఆస్పత్రికి గురువారం ఉదయం పది గంటలకు వెళ్లి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విచారణ చేశారు. పీజీ విద్యార్థినులు, మహిళా వైద్యులు, సిబ్బందిని వేర్వేరుగా పిలిచి వేధింపులకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నాళ్ల నుంచి ఇలా జరుగుతోంది?, ఏ విషయాల్లో ఇబ్బంది పెడుతున్నారు?...అనే అంశాలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో మహిళ ఒకరు ఆడియో రికార్డింగ్‌ను డీఎంఈకి పంపించారు. అది కమిటీకి అందజేయడంతో, దానిని వినిపించి, అందులో అంశాలు వాస్తవమా?, కాదా?...అని పలువురిని ప్రశ్నించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. సిబ్బందిలో కొందరు అదంతా నిజమే అని చెప్పగా, అయితే రాతపూర్వకంగా రాసి ఇవ్వాలని కమిటీ సభ్యులు కోరగా, ఆ తరువాత తమకు మళ్లీ ఇబ్బందులు వస్తాయని, వారు వెనకడుగు వేసినట్టు సమాచారం. ఉన్నతాధికారి చరిత్ర గురించి కూడా కమిటీ ఆరా తీసింది. మహిళలు వెల్లడించిన అంశాలపై కమిటీ చర్చించి, అవసరమైతే మరోసారి ఆస్పత్రికి వెళ్లి ఇంకాస్త లోతుగా విచారణ చేయాలని కమిటీ భావిస్తున్నట్టు తెలిసింది. ఏదేమైనా రెండు రోజుల్లో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు కమిటీ నివేదిక ఇవ్వనుంది.

## పక్వానికి చెరకు తోటలు

... 5వ పేజీ తరువాయి

సుక్రోజు శాతం.. రెండింటినీ సమన్వయ పరచుకొని చెరకు క్రషింగ్ చేపడితే లాభసాటిగా ఉంటుంది.

**రైతుస్థాయిలో పక్వదశ పరీక్ష**

రైతులు చెరకు పక్వదశను తోటల వయస్సు, ఇతర లక్షణాలపై ఆధారపడి నిర్ధారిస్తారు. సాధారణంగా చెరకు విత్తనం నాటిన 9-10 నెలలకు పంట పక్వానికి వస్తుంది. చెరకు ఆకులు పసుపు రంగులోకి మారడమే ఇందుకు సూచిక. కొత్తగా మొవ్వ ఆకులు వేయడం ఆగి పోతుంది. గడల చివర కణుపులు దగ్గరగా ఏర్పడి ఆకులు కుచ్చుగా కనిపిస్తాయి. కొన్ని రకాల్లో పూత వస్తుంది. పూతకు వచ్చిన రకాలను వెంటనే నరికి గానుగాడుకోవాలి. లేదా షుగర్ ఫ్యాక్టరీకి తరలించాలి. చెరకు గడల పైభాగంలో, మొదలు భాగంలో తీపి ఒకేలా ఉన్నప్పుడు దానిని ముదిరిన చెరకు తోటగా చెప్పవచ్చు. నిర్ధారణ మరింత కచ్చితంగా చెప్పాలంటే.. చెరకు గడను రెండు ముక్కలుగా నరికి, వేరువేరుగా గానుగాడి పైభాగం, కింది భాగం రసంలోని తీయదనం ఇంచుమించు ఒకే రకంగా ఉన్నప్పుడు ఆ చెరకు తోట పక్వానికి వచ్చినదని చెప్పవచ్చు. బెల్లం రైతులు తమ అనుభవంతో ఇలాంటి అంచనాల ద్వారా పక్వతను నిర్ణయిస్తారు. షుగర్ ఫ్యాక్టరీలు పక్వత సర్వే జరిపి తోటల కటింగుకు అనుమతులిస్తాయి.

**రిఫ్రాక్టోమీటర్‌తో నిర్ధారణ**

చెరకు గడల్లో నుంచి కొన్ని చుక్కల రసాన్ని తీసి రిఫ్రాక్టోమీటర్‌తో పరిశీలించి రసంలోని చక్కెర ఘన పదార్థ పరిమాణాన్ని బ్రిక్స్ శాతంగా పేర్కొంటారు ఈ శాతం ఎక్కువగా ఉన్న తోటలను ముందుగాను, తక్కువ ఉన్న తోటలను తరువాత నరికేందుకు షుగర్ ఫ్యాక్టరీలు అనుమతులు ఇస్తాయి. నవంబరు నెలలో పగటి ఉష్ణోగ్రతలు, రాత్రి ఉష్ణోగ్రతల మధ్య వ్యత్యాసం అధికంగా ఉంటుంది. చల్లని పొడి వాతావరణాన్నిబట్టి చెరకు గడల్లో చక్కెర శాతం మారుతూ ఉంటుంది. రిఫ్రాక్టోమీటర్ ధర రూ.2 వేలు ఉంటుంది. దీనిని ఉపయోగించి చెరకు పక్వత నిర్ధారణ పరీక్షలు చేయడంలో రైతులకు తర్ఫీదు ఇవ్వడం అవసరం.

## పొంచిఉన్న తుఫాన్ గండం

... 5వ పేజీ తరువాయి

శాఖ వెల్లడించింది. అంటే మరో వారం రోజుల్లో ఉత్తర కోస్తాలో వర్షాలు కురిసే అవకాశం వుండడంతో వరి రైతులు అప్రమత్తంగా వుండాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. అందివచ్చిన వరిపంటను ఒకటి, రెండు రోజుల్లో కోత కోసి, పనలు ఆరిన వెంటనే కుప్ప వేసుకోవాలని సూచిస్తున్నారు. మూడు రోజుల తరువాత వరి కోతలు కోయకుండా వుంటే మంచిదని, తుఫాన్ ప్రభావాన్నిబట్టి నిర్ణయం తీసుకోవాలని చెబుతున్నారు.

**రావికమతం మండలంలో మొదలైన వరికోతలు**

రావికమతం మండలంలో ఈ ఏడాది మూడు వేల హెక్టార్లలో వరి సాగు చేపట్టారు. కొమిర, మత్స్యపురం, గుమ్మాళ్లపాడు, గుడివాడ, గర్నికం, కేబీపీ అగ్రహారం తదితర గ్రామాల్లో బోర్లు వున్న పొలాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో ముందుగా నాట్లు వేశారు. ఇందులో సుమారు 250 ఎకరాల్లో వరికోతలు పూర్తయ్యాయి. కొన్నిచోట్ల కుప్పలు వేయగా, మరికొన్నిచోట్ల పనలపై వుంది. తుఫాన్ వచ్చేనాటికి వరి కుప్పలు వేసుకుంటామని రైతులు చెబుతున్నారు. అయితే వారం, పది రోజుల్లో వరి పంట కోతకు వచ్చే అవకాశం వున్నచోట ఆయా రైతులు తుఫాన్ సమాచారంతో ఆందోళన చెందుతున్నారు.

## చెరువులకు మహర్దశ

... 5వ పేజీ తరువాయి

పూర్తిచేయడానికి రూ.84 కోట్లు మంజురయ్యాయని తెలిపారు. ఉత్తరాంధ్రలో అసంపూర్తిగా వున్న తొమ్మిది జలాశయాల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. వీటికి రూ.20,300 కోట్లు వ్యయంతో చేస్తున్నామన్నారు. ఈ పనులు పూర్తయితే ఇంతవరకు ఉన్న ఆయకట్టు 2.5 లక్షల ఎకరాలతోపాటు మరో 1.4 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని వెల్లడించారు. ఈ పనులన్నీ రెండేళ్లలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఆయన వెంట డీఈఈ సత్యంనాయుడు, నీటి సంఘం చైర్మన్ పాత్రునాయుడు, తదితరులు వున్నారు.

# క్రైం... crime news

## రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఎలమంచిలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి మునిసిపాలిటీ లోని కొక్కిరాపల్లి ప్రేమసమాజం సమీపంలో జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున వాహనం ఢీకొని ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని రూరల్ ఎస్‌ఐ ఉపేంద్ర తెలిపారు. కొక్కిరాపల్లి జంక్షన్ వద్ద నడిచి వెళుతున్న ఒక గుర్తు తెలియని వ్యక్తి వాహనం ఢీకొనగా, తీవ్రంగా గాయపడ్డాడన్నారు. అతనిని 108 వాహనంలో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. అతని వయస్సు 30 సంవత్సరాల లోపు ఉండవచ్చునని, వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఎలమంచిలి రూరల్ పోలీసులను సంప్రతించాలని తెలిపారు.

## కమర్షియల్ కాంప్లెక్స్‌లో అగ్నిప్రమాదం


దగ్ధమైన కారు

విశాఖపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మద్దిలపాలెం ఆటోమోటివ్ జంక్షన్ వద్ద గురువారం ఉదయం కమర్షియల్ భవనంలో అగ్నిప్రమాదం సంభవించింది. గ్రౌండ్ ఫ్లోర్‌లో లిఫ్ట్ వద్ద విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కావడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. లిఫ్ట్ వద్ద చెలరేగిన మంటలు భవనం మొత్తం వ్యాపించాయి. ఉదయం ఏడు గంటలకు ప్రమాదం జరగడం, అప్పటికి ఏ దుకాణం తెరుచుకోకపోవడం వల్ల ప్రాణనష్టం కలగలేదు. మంటలు మాత్రం భారీగా ఎగిసిపడ్డాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అగ్నిమాపక శకటాలు చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేశాయి. ఎంత ప్రయత్నించినా మంటలు అదుపులోకి రాకపోవడంతో నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి 14 ఫైర్ ఇంజన్లను రప్పించారు. కాగా కమర్షియల్ భవనంలో కింద రెండు ఫ్లోర్‌లలో టాటా కార్ల షోరూమ్, కార్ల ఇంటీరియర్ వర్క్స్, స్పేర్ పార్ట్స్, ఫిలిప్స్, ఇడెన్ షాపులున్నాయి. పైన అంతస్థులో ఫంక్షన్ హాలు, జిమ్ ఉన్నాయి. కింది ఫ్లోర్‌లోకి మంటలు వ్యాపించడంతో కార్ల షోరూమ్‌లో కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కార్ల ఇంటీరియర్ మెటీరియల్స్ పాడయ్యాయి. సెల్లార్‌లోకి మంటలు వెళ్లడంతో పార్కింగ్ చేసిన ఒక కారు 70 శాతం దగ్ధమైంది. మరో రెండు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అధికంగా భవనానికి నష్టం వాటిల్లింది. ఆస్తి నష్టం సుమారు రూ.50 లక్షలు ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు.

**స్తంభించిన ట్రాఫిక్..**

జాతీయ రహదారిపై భవనం అగ్ని ప్రమాదానికి గురై మంటలు ఎగిసిపడడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. మద్దిలపాలెం నుంచి హనుమంతువాక జంక్షన్ వరకు వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టి పరిస్థితిని చక్కదిద్దారు.

**పది మందిని రక్షించిన యువకులు**

మంటలు అంటుకున్న భవనం పైఅంతస్థులో ఉన్న జిమ్ సెంటర్ ఉంది. కింద లిఫ్ట్ వద్ద చెలరేగిన మంటలు పైన ఉన్న జిమ్ వరకు వెళ్లిపోయాయి. అప్పటికే జిమ్‌లో పది మంది వర్కవుట్స్ చేస్తున్నారు. ఒక్కసారిగా మంటలు, పొగ చెలరేగడంతో అందులో చిక్కుకున్నారు. సెంటర్ చుట్టు పొగలు కమ్మేయడంతో భయాందోళనలకు గురయ్యారు. జిమ్‌లో ఉన్న ఎస్.సురేశ్, వై.దినేష్‌లు భయపడకుండా భవనం నుంచి బయటపడేందుకు ఆలోచన చేశారు. అప్పటికే అగ్నిమాపక సిబ్బంది కూడా వచ్చేశారు. జిమ్ సెంటర్‌లో ఇరుక్కున్న వారిని రక్షించేందుకు అగ్నిమాపక సిబ్బంది బిల్డింగ్ వెనుక నుంచి పైకి వెళ్లారు. అప్పటికే సురేష్, దినేష్‌లు సీలింగ్ రేకులు విరగ్గొట్టి అందులో నుంచి జిమ్‌లో ఇరుక్కున్న వారిని పైకి చేరవేశారు. వాళ్లని ఫైర్ సిబ్బంది వెళ్లి కిందకు దింపడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

# రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నక్కపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం పి.విజయ తెలిపారు. అండర్ -14 విభాగం ఎస్‌జీఎఫ్ హాకీ పోటీలకు కె.నాగ తనూజ్, పి.రాకేశ్, ఈ విశాల్, అండర్ -17 విభాగంలో ఎం.దిలీప్, కె.నాగ తరుణ్, కె.గణేశ్, బి.నగేశ్, ప్రభుకుమార్,పి.రోహిత్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఆమె గురువారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ నెల 22న తిరుపతిలో అండర్-14 రాష్ట్ర స్థాయి పోటీలు, పులివెందులలో 27న జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్-17 విభాగం విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. ఈ మేరకు విద్యార్థులను హెచ్ఎం సహా ఉపాధ్యాయులు టీవీ రమణ, డి.శ్రీనివాస్, పి.వరలక్ష్మి, పి.శ్రీనివాస్, పీడీలు నీరజ, ధనలక్ష్మి అభినందించారు.

# తీర ప్రాంతాల్లో సాగర్ కవచ్

- మెరైన్, నేవీ, పోలీసు అధికారుల తనిఖీలు


పూడిమడక తీరంలో పోలీసు అధికారులు

అచ్యుతాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలోని తీర ప్రాంతాల్లో మెరైన్, నేవీ, లా అండ్ ఆర్డర్ పోలీసులు గురువారం సాగర్ కవచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగర మార్గం ద్వారా ఉగ్రవాదులు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వాళ్లు వస్తే వారిని గుర్తించి ఎలా పట్టుకోవాలనే దానిపై రెండు రోజులు ఎక్సర్‌సైజ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పూడిమడక తీరంలో భారీగా పోలీసులు మోహరించారు. పూడిమడక తీరంలో నుంచి అచ్యుతాపురం వైపు వెళ్లే దారుల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసి వాహనాలు తనిఖీ చేశారు. పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్, మెరైన్ సీఐ సింహాద్రి నాయుడు, అచ్యుతాపురం సీఐ ఆర్‌వీఎస్ఎస్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

**చికెన్ ధరలు**

| బ్యాగ్ | రూ.లలో |
| --- | --- |
| రైతు ధర | 107.00 |
| లైవ్ ధర | 127.00 |
| విత్ స్కిన్ | 224.00 |
| స్కిన్ లెస్ | 234.00 |

**కోడి గుడ్లు (నెక్)**

| వంద గుడ్లు | రూ.లలో |
| --- | --- |
| విశాఖపట్నం | 635 |
| విజయనగరం | 639 |
| శ్రీకాకుళం | 639 |